పంచాయతీ కార్యదర్శి పనితీరుపై గ్రామస్తుల ఆగ్రహం



నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని దౌలత్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి స్థానిక సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కాగా పంచాయతీ కార్యదర్శి గ్రామ పరిపాలన నిర్వహణను సక్రమంగా అమలు చేయడం లేదని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ గ్రామస్తులు, తండావాసులు కార్యదర్శి సుమలతను నిలదీశారు. పని చేయని పంచాయతీ కార్యదర్శి మా కొద్దు అని పట్టుబట్టారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిని తప్పించి గ్రామ పరిపాలనను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్టెడ్ సభ్యులు మహ్మద్ సర్వర్, వార్డ్ సభ్యులు పల్లకొండ రమేష్, పర్యా ఏఎస్ఎం సుమలత, ఫీల్డ్ అసిస్టెంట్ రాము,అంగన్వాడీ టీచర్లు సులోచన,రజిత, ఆశా వర్కర్ మంజుల, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-గీసుగొండ

ప్రతీ విద్యార్థి చట్టాలపై పట్టు కలిగి ఉండి అవగాహన లేనివారికి వివరించే విధంగా ఉండా లని సఖీకేంద్రం కౌన్సిలర్ నూర్జహాన్, శోభారాణి అన్నారు. వరంగల్ మహానగర్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో సఖి కేంద్రం ఆధ్వర్యంలో వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం కౌన్సిలర్ నూర్జహాన్ శోభారాణి ఇరువురు మాట్లాడుతూ పోక్సో అక్ట్ ,బాల్య వివాహ నిరోధక,నిర్భయ,గృహింస చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళల కోసం 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098,0870-3571 832 ఈ నెంబర్లు 24 గంటలు అందుబాటులో ఉంటాయని వీటిని సంప్రదిస్తే సహాయం అందుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు సమ్మిరెడ్డి, ఎస్ఎంసి నెంబర్ కొక్కొండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్ సమగ్రాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా ఇంచార్జీ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 12 నియోజకవర్గాల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగాహాజరై నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, కుడా, జిడబ్ల్యుఎంసి, నేషనల్ హైవేస్, ఐటీడీఏ, హౌసింగ్, పోలీస్, ఫారెస్ట్, దేవాదాయ శాఖ ల పనితీరు, చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలుచేపట్టాలన్నారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో ఏ స్టేజిలో ఉన్నా పూర్తిచేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఫిబ్రవరి మాసంలో మేడారం జాతర నేపథ్యంలో ఈనెల 30న మేడారం వస్తామని, అక్కడ ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. మేడారం జాతరను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని, జాతరపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ ఆలోచనల మేరకు అధికారులు నడుచుకోవాలని తమది ఫ్రెండ్లీ ప్రభుత్వమని పేర్కొన్నారు.

అధికారులు ప్రజాపాలన కార్యక్రమంలో అద్భుత పనితీరును కనబరిచారని ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా అట్టడుగుస్థాయిలోని నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందాలన్నారు. పంటల సాగుకు సాగునీరు అందించకపోతే ఇబ్బందులు వస్తాయని కాబట్టి ఆశాఖ అధికారులు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏ పనికైనా అడ్డగోలుగా అంచనా వ్యయం వేయకుండా అధికారులు చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, గురుకులాలను తరచుగా జిల్లా కలెక్టర్లు, అధికారులు తనిఖీ చేయాలని అన్నారు. ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడే అక్కడ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు. తాను కూడా ఎక్కడో చోట ఆకస్మికంగా తనిఖీ చేస్తానని పేర్కొన్నారు. తనిఖీ సమయంలో అక్కడి పరిస్థితి బాగా లేకుంటే చర్యలు తప్పవన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి కొండా సురేఖ



ఈ సమావేశంలో రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. పాలకులంకాదని ప్రజలకు సేవకులం అని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలకు కావాల్సిన పథకాలను అందించేందుకు కృషి చేస్తామని ప్రజలకు అన్ని సౌకర్యాలు అందాలన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి కోసం డీఆర్సీ, డీఆర్డీవో సమావేశాలు జరిగేవని అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి కోసం సమావేశాలు నిర్వహించలేదని, దీంతో ప్రజలకు నష్టం జరిగిందన్నారు. నియోజకవర్గాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రుల దృష్టికి తీసుకురావాలన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ చేయాలని, ఇందుకు భూసేకరణ పూర్తి కావాల్సి ఉందన్నారు. త్వరలోనే ఎయిర్‌పోర్టు భూములను పరిశీలించేందుకు మంత్రి పొంగులేటి రావాలని కోరారు.

ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఫ్రూట్ మార్కెట్‌తో పాటు వరంగల్లో కూరగాయల మార్కెట్ అంశాన్ని ప్రస్తావించారు. చాలావరకు ప్రభుత్వ గురుకులాలకు సొంత భవనాలు లేవని అన్నారు. నాలాల ఆక్రమణపై అధికారులు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. హరితహారం కార్యక్రమంలో పండ్ల మొక్కలను పెంచేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్ ...

వెయ్యి పశువులను తిన్న రాబందు నీతికథలు చెప్పినట్టు కేటీఆర్ వ్య వహారం ఉంది. సర్పంచ్‌లకు నిధులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వము గోసపెట్టింది. కేటీఆర్ ఇప్పుడు సర్పంచ్‌ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. గత ప్రభుత్వం సర్పంచ్‌లను వేధించింది. నిధులు మంజూరు చేయక పోవడంతో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారు.త్వరలోనే సర్పంచ్ లకు రావాల్సిన నిధులన్నీ విడుదల చేస్తాం.

- ధనసరి సీతక్క, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి

సమస్యల పరిష్కారానికే సమీక్ష : మంత్రి సీతక్క



ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న నియోజకవర్గాల వారీగా ఉన్న సమస్య ల పరిష్కారం కోసం ఈ సమీక్ష సమావేశం కా ర్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థా యిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం జరగబోయే బడ్జెట్ లో కావాల్సిన అంశాలపై ఈ సమావేశం ద్వారా అవగాహన కలుగుతుందన్నారు. సమన్వయంతో అధికారులు పనిచేయాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించేందుకు సమీక్షా సమావేశం ఉపయోగపడుతుందన్నారు. మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులను మరిన్ని కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మేడారం జాతరకుఏర్పాట్లను పరిశీలించేందుకు రావాలని మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, సురేఖలను ఆహ్వానించారు. జాతరకు భక్తులు పెద్ద సంఖ్యల్లో వస్తారు. కాబట్టి పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయాలని అన్నారు. 25, 28వ తేదీల్లో మేడారం జాతరను సందర్శించాలని మంత్రి సీతక్క కోరారు.

రామప్ప లక్నవరం సరస్సులను అనుసంధానం చేయడం కోసం శాశ్వత గ్రావిటీ కాలువల నిర్మాణం కోసం భూసేకరణ జరిగిందని, పెండింగ్‌లో ఉన్న ల్యాండ్ అక్విటేషన్‌కు డబ్బులు అందించాలన్నారు.

పథకాల అమలుకే ప్రజాపాలన : మంత్రి పొన్నం

ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి ధ్యేయంగా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ పరిధిలో ఉన్న మూడు మండలాలు హనుమకొండ జిల్లాపరిధిలోనికి వచ్చాయని వాటి అభివృద్ధికి అధికారులు ప్రణాళికతో ఉండాలన్నారు.

వరదల నివారణకు చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే నాయిని

ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరం తరువాత వరంగల్ రెండవ స్థానంలో ఉందని, వరంగల్ మహానగర పాలక సంస్థకు అధిక నిధులు కేటాయించాలని ఇంచార్జ్ మంత్రిని కోరారు. నగరంలో చాలా చోట్ల నాలాలు ఆక్రమణకు గురవడంతో వర్షాకాలంలో వరదలు నగరాన్ని ముంచెత్తుతున్నాయని, వాటిపైచర్యలు తీసుకోవాలని, నగరం ముంపునకు గురి కాకుండా చర్యలు తీసు కోవాలని కోరారు. హనుమకొండలో చెరువులు, కుంటలు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నయీమ్ నగర్ నాలా వద్ద వర్షాకాలంలో వరదలకారణంగా రాకపోకలకు ఇబ్బంది కలుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి అన్నారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. వాటికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధంచేయాలని అందుకు నిధులను కేటాయించేందుకు కషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. నగరంలోని నాలాలు, డ్రైనేజీలపై దష్టి పెట్టాలని, నగరం ముంపునకు గురి కాకుండా మొదటి ప్రాధాన్యత నివ్వాలన్నారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్‌లో విలీనం చేసిన గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని అనుకున్నంత అభివృద్ధి జరగలేదన్నారు. గతంలో ఉన్నట్లుగానే తమ గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఉంచాలని విలీన గ్రామాల ప్రజలు కోరుతున్నారని అన్నారు. చెరువులు, కుంటలు ఆక్రమణకుగురవుతున్నాయని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని 13 డివిజన్ల లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదన్నారు. మడికొండ డంపింగ్ యార్డ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ విలీన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సమస్యల పరిష్కారానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్, కలెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యపై సమగ్ర వివరాలతో డిపిఆర్ ను తయారు చేయాలని, డంపింగ్‌యార్డ్ సమస్యకు పరిష్కార మార్గాలను చూడాలన్నారు.

గ్రీన్ ఫీల్డ్‌కు అవసరం మేరకే భూములు తీసుకోవాలి : రేవూరి

ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ పేరుతో గత ప్రభుత్వం జీవో ను తెచ్చిందని, దానిని రైతులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. రైతులు వ్యతిరేకిస్తున్న ల్యాండ్ పూలింగ్ జీవో ఇంకా రద్దు కాలేదని అభిప్రాయం ఉందని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ వే కోసం అవసరమైన మేరకే భూములను తీసుకోవాలని ఎక్కువ తీసుకోవద్దని సూచించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్‌జాటోత్ రామచంద్రనాయక్, హుజురాబాద్, జనగాం, పాలకుర్తి, మహబూబాబాద్, నర్సంపేట, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట, జయశంకర్ భూపాలపల్లి ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, డాక్టర్ మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ, వరంగల్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, శివలింగయ్య, ఇలా త్రిపాఠి, భవేష్ మిశ్రా, అద్వైత్ కుమార్ సింగ్, జి డబ్ల్యు ఎం సి కమిషనర్ రిజ్వాన్ భాషా షేక్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఎస్పీలు శబరీష్, డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, కిరణ్ కారే, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగరాలే, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో ప్రోటోకాల్ అమలు ఏదీ..?

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరుజిల్లాల అభివృద్ధి కార్యక్రమా లపై నిర్వహించిన సమీక్షాసమావేశానికి పలువురు ప్రజాప్రతిని ధుల ను ఆహ్వానించకపోవడం చర్చనీయాంశంగా మారింది. శనివారం హన్మకొండ కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ప్రోటోకాల్ పాటించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేవలం ఎమ్మెల్యేలను మాత్రమే ఆహ్వానించి ఇద్దరుఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించకపోవడం గమనార్హం.వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవితలతోపాటు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, సిరికొండ మధుసూదనాచారి,తక్కళ్లపల్లి రవీందర్‌రావు టీచర్స్ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలకు ఆహ్వానం పంపలేదని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో ఎంపీలు, ఎమ్మెల్సీలు ఈ సమీక్షా సమావేశానికి హాజరు కాలేదు. దీంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. బిఆర్ఎస్‌కు చెందిన జనగామ, హుజురాబాద్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డిలు ఈ సమావేశానికి హాజరు కాగా, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరు కాలేదు.

కేసీఆర్ ప్రభుత్వంలో సర్పంచ్‌లు బలి

- అభివృద్ధి పనులపై బిల్లులు చెల్లించి ఆదుకోవాలి



నవతెలంగాణ-నర్సంపేట

ఎన్నికల్లో ఓట్లను దండుకోవడానికి కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సర్పంచ్‌లతో అభివృద్ధి పనులు చేయించి బలి పశువులను చేశాడని తెలంగాణ ఐక్యవేదిక నాయకులు, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ మాజీచైర్మన్ భానోతు సంగులాల్ ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన విలేకరులసమావేశంలో సంగులాల్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో సర్పంచ్‌లు వివిధ అభివృద్ధి పనులు చేపట్టి బిల్లురాక దగా పడ్డారన్నారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెడుతూ రోడ్లు, భవనాల పేరిట పనులను మంజూరు చేశారని తెలిపారు. ఎమ్మెల్యేలు వాటిని సర్పంచ్‌లకు అప్పగించి పనులు వేగంగా చేపట్టాలని ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసమే పనులు చేపట్టారని ఎమ్మెల్యేల చిత్తశుద్ధిని విశ్వసించక కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపించారన్నారు. అడ్డదారిలో కిందటి ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులను నిలిపివేసిందన్నారు. గ్రామాభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లు లక్షలాదిగా పెట్టుబడులు పెట్టి బిల్లులు రాక రోడ్డునపడి అడకత్తెరలో పోకచెక్కలా కొట్టుమిట్టాడుతున్నారు. కేసీఆర్, ఆపార్టీ ఎమ్మెల్యేల చేతిలో దగా పడిన సర్పంచ్‌లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సిన అవసరంఉందన్నారు. త్వరలో పదవీ కాలం ముగించుకోనున్న సర్పంచ్‌లను ఆదుకోకపోతే అనేక మంది ఆత్మహత్యలు చేసుకొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం సర్పంచ్‌ల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలం లోని వడ్లకొండ లో శ్రీ రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కోసం శనివారం అలుగునూరి రాజు-అనిత దంపతులు రూ.50,116లు విరాళం అందించినట్లు సర్పంచ్ అమడగాని రాజుయాదవ్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ మతతత్వ రాజకీయాలను తిప్పికొట్టాలి

- ఫిబ్రవరి 16న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పిలుపు



నవతెలంగాణ-మట్టెవాడ

కేంద్రంలోని బిజెపి మతతత్వ రాజకీయాలను తిప్పి కొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పిలుపునిచ్చారు. సిఐటియు-వ్యవసాయ కార్మిక సంఘం రైతుసంఘం సంయుక్త సమావేశం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా సమ్మయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఈసం పెళ్లి బాబుల అధ్యక్షతన వరంగల్ ఉరుసుగుట్ట సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య ముఖ్యఅతిథిగా రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కార్పొరేట్, మతోన్మాద, నయా ఉదారవాద విధానాల వలన ప్రజల నుండి వచ్చే కార్మికవర్గం రైతాంగం పేద ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతను గుర్తించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపుకోసం బీజేపీ మత రాజకీయాలకు తెరలేపుతూ అయోధ్యరామ మందిరాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు. ఇంకా పూర్తిగా నిర్మాణంకానీ అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠచేయడం సరికాదని, పెద్ద పెద్ద పీఠాధిపతులు సూచించినా కూడా పట్టించుకోకుండా పార్లమెంటు ఎన్నికల ముందే కార్యక్రమాన్ని తీసుకుందని అక్షింతల పేరుతో ప్రతిఇంటికి వెళుతూ ప్రజల ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను పక్కదారి పట్టించే విధంగా ప్రజల్ని మతం మత్తులో ముంచుతుందన్నారు. ఈ బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టడంలో భాగంగా దేశంలోని కార్మిక వర్గం , రైతాంగం , ప్రజలందరినీ చైతన్యం చేయడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు, (రైతు సంఘాల ఐక్యవేదిక) సంయుక్త కిసాన్ మోర్చా , అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ , పారిశ్రామిక బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో జరిగే పారిశ్రామిక , గ్రామీణ బంద్ విజయవంతనికి సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం, సమావేశాలు నిర్వహించి వరంగల్ జిల్లావ్యాప్తంగా సమ్మె ప్రచార క్యాంపెయిన్ చేపట్టి ఫిబ్రవరి 16న గ్రామీణ బందును జయప్రదం చేయాలని, బిజెపి ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పి కొట్టాలని, జిల్లాలో సమ్మెను విజయవంతం కోసం మూడు సంఘాలు కలిసి కార్యాచరణ రూపొందించుకోవడం జరిగిందనీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటి యు నాయకులు ఇనుముల శ్రీనివాస్, సింగారపు బాబు, తుమ్మల సాంబయ్య, బ్రహ్మాచారి, నాగపూర్ వెంక న్న, ప్రభాకర్ ,ఆశా వర్కర్స్ నాయకులు రాణి, వజ్ర , వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కాశిబుగ్గ

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని సుందరయ్య నగర్‌లో ఇటీవల మృతి చెందిన సీనియర్ ఆటో డ్రైవర్ మరిగిద్దె రాములు కుటుంబానికి శనివారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆటో యూనియన్ అధ్యక్షుడు దుంపేటి శ్రీను. మాజీ ఆటో యూనియన్ అధ్యక్షుడు అడుప మహేష్, ఆటో డ్రైవర్లు రాములు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈసందర్భంగా శ్రీను,మహేష్‌లు మాట్లాడుతూ అందరితో కలివిడిగా ఉండే రాములు మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి యూనియన్ తరపున అండగా ఉంటామని తెలిపారు. ఎంతోమంది ఆటోడ్రైవర్లకు రాములు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హనుమకొండ కుమార్, కోశాధికారి యనమందల కష్ణ, సహాయ కార్యదర్శి నీడిగొండ శ్యామ్, సహాయ ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీధర్, కన్నా, పాషా, తదితరులు పాల్గొన్నారు

కామ్రేడ్ నర్సయ్య జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం

- నర్సయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎంపీ బోయినపల్లి



నవతెలంగాణ-రాయపర్తి

సిపిఐ నాయకులు, టిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కామ్రేడ్ తాళ్లపల్లి నర్సయ్య జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం అని రాష్ట్ర మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని శివరామపురం (ఆర్‌అండ్‌ఆర్)గ్రామంలో కామ్రేడ్‌నర్సయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ముఖ్య అతిధులుగా ఎర్రబెల్లి, బోయినపల్లి విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే ప్రజా పోరాటంలో పాల్గొనే వారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడ్డారని అన్నారు. మరిదశ తెలంగాణ ఉద్యమంలో గల్లి నుండి ఢిల్లీ వరకు తెలంగాణ వాదాన్ని వినిపించిన మహానుభావుడు కామ్రేడ్ నర్సయ్య అని కొనియాడారు.

తుది శ్వాసవిడిచే వరకు బడుగు బలహీన వర్గాల ప్రజల బాగుకోసం కృషి చేశాడని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు కర్ర రవీందర్ రెడ్డి, నర్సయ్య కుటుంబ సభ్యులు శాంతమ్మ, శోభారాణి చంద్ర ప్రకాశ్, విజయజనార్ధన్, తేజస్వి, శతి, రవితేజ, సీపీఐ నాయకులు సుబ్బారావు, జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి సమ్మెర విశ్వేశ్వర్, మండల కార్యదర్శి గాజు యాకయ్య, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, సర్పంచ్ కుమార స్వామి, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడునరసింహా నాయక్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సురేందర్ రావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎండి నాయిమ్, గబ్బెట బాబు, నాగపురి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
హనుమకొండ
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

యూనివర్సిటీ గేట్ల ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ మొదటి, రెండవ గేటు వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని శనివారం కేయూ ఉద్యోగస్తులు మొదటి గేటు నుంచి రెండవ గేటు వరకు ర్యాలీ నిర్వహించి హనుమకొండ ట్రాఫిక్ సిఐకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్, ప్రధాన కార్యదర్శి ఆర్‌డి.ప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ మధుకర్‌రావు, డాక్టర్ తేజ, డాక్టర్ శ్రీధర్ కుమార్, డాక్టర్ విజయ్ కుమార్, సంతోష్, స్వప్న, లక్ష్మి, ప్రసన్న రాణి, డాక్టర్ కల్పన, అమరేందర్, దయాకర్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ శ్యామ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కాంగ్రెస్ ఎంపీ టికెట్ కేటాయించాలి



నవతెలంగాణ-హన్మకొండ

వచ్చేఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీగా తనకే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి రజనీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ హరిజన కులానికి చెందిన తాను కాంగ్రెస్ పార్టీలో చాలా ఏళ్లుగా పనిచేస్తూ అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నానని జిల్లా న్యాయస్థానం, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాదిగా కూడా పనిచేస్తున్నానని తెలిపారు. మా కుటుంబ నేపథ్యం కూడా పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి అంకితమైందని మా తాత కందుకూరి కాంతయ్య గోపాలపురం మాజీ సర్పంచ్‌గా పనిచేశారని ఆయన మాజీ మంత్రి పివి.రంగారావుకు అత్యంత సన్నిహితుడిగా ఉన్నాడని తెలిపారు. పార్టీ కోసం తన తాతయ్య ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ పార్టీ కి సేవ చేశారని చివరికి ఆయన తెలుగుదేశం ప్రభుత్వ నాయకుల చేతిలో హత్య చేయబడ్డారన్నారు.

గుంటూరు కారం సినిమాను నిషేధించాలి : సీపీఎం



నవతెలంగాణ-ఐనవోలు

ఈనెల 12న విడుదలైన గుంటూరు కారం సినిమాలోని విలన్ పాత్రలకి ప్రపంచ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ కారల్ మార్క్స్, లెనిన్‌ల పేర్లు పెట్టడాన్నితీవ్రంగా ఖండిస్తూ ఆ సినిమాని నిషేధించాలని, దర్శక, నిర్మాతలపై కేసు నమోదు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ కమ్యూనిస్టు నేతలు పేదప్రజల ఆశ జ్యోతిలు కార్మిక వర్గ నేతలు కారల్‌మార్క్స్, లెనిన్ ప్రపంచానికి దిక్సూచిగా నిలిచి ఈ దోపిడి, పెట్టుబడిదారి, భూస్వామ్యయ బూర్జువా వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయం చూపిన ప్రపంచ మేధావులను గుంటూరు కారం సినిమాలో విలన్లకు కామ్రేడ్ కారల్ మార్క్స్, లెనిన్‌ల పేర్లు పెట్టడం దర్శక నిర్మాతలు భూస్వామ్య వ్యవస్థకు వత్తాసు పలుకుతూన్నారని. కార్మిక, పేదలపక్షాన నిలుచున్న అలాంటి మేధా వుల ఈ ప్రపంచానికి విలన్లుగా చూపెట్టడాన్ని సెన్సార్ బోర్డు ఎందుకు పరిగణలోకి తీసుకోని ఆ పేర్లను ఎందుకు తొలగించలేదు చెప్పాలన్నారు. సెన్సార్ బోర్డు కూడా కావాలనే మౌనం వహించిందని విలనుకు కారల్‌మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని సీపీఎంతీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్మిక వర్గానికి క్షమాపణ చెప్పి ఆ సినిమాను నిషేధించాలని లేదా అందులో విలన్ల పేర్లు మార్చాలని డిమాండ్ చేశారు . తొలగించకుంటే ఆదర్శక నిర్మాతలపై కేసులు పెడతామని, ఆందోళన చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో మేధావుల పేర్లు పెట్టవద్దని డిమాండ్ చేశారు.

దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే రేవూరి



నవతెలంగాణ-నడికూడ

మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలోని దర్గా (ఉర్సు) ఉత్సవాలలో శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా దర్గాకు వచ్చిన రేవూరి ప్రకాశ్‌రెడ్డిని దర్గా పీఠాధిపతులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దర్గా ను దర్శించుకుని ఛాదర్‌కప్పి పీఠాధిపతులతో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్, సీనియర్ నాయకులు పర్నెం మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రంపహాడ్ జాతర చైర్మన్‌గా శీలం రమేష్



నవతెలంగాణ-ఆత్మకూరు

మండలం లోని ఆగ్రంపహాడ్ సమ్మక్క సారక్క జాతర నూతన కమిటీ చైర్మన్ గా ఆగ్రంపహాడ్ గ్రామానికి చెందిన శీలం రమేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శీలం రమేష్ యాదవ్ స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నీ హనుమకొండ ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నాఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే రేవూరికి గ్రామ ప్రజలకు కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఫిబ్రవరి నెలలో జరుగబోయే ఆగ్రంపహాడ్ సమ్మక సారక్క మినీమేడారం జాతరను అధికారుల, గ్రామ ప్రజల సహకారంతో విజయవంతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-దామెర

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ హన్మకొండ వారి ఆధ్వర్యంలో శనివారము దామెర మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో 60 ఏళ్లపైబడిన వయోవృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరాన్ని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి భూమినేని పాపిరెడ్డి ఆదేశానుసారం ఆరోగ్యశిబిరాన్ని దామెర గ్రామ సర్పంచ్ గురజాల శ్రీరామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డాక్టర్ టి.మదన్మోహన్‌రావు, డాక్టర్ మహమ్మద్ తాహిర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది శివకుమార్,గంగాధర్, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహానికి పంచలోహ తొడుగు



నవతెలంగాణ-ఆత్మకూరు

మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో శనివారం రూ.4.16 లక్షలతో సాయిబాబా, గణపతి, దత్తాత్రేయ స్వామి విగ్రహాలకు పంచలోహ తొడుగులు ఏర్పాటుచేసి సుందరంగా అలంకరించారు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన దాత లంకా సుధాకర్ సౌజన్యంతో ఆలయ వెలివేషన్ పుట్టి, ఆలయానికి రంగులు విగ్రహాలకు పంచలోహ తొడుగులు ఏర్పాటు చేశారు. శనివారం లంక సుధాకర్ లంకా రవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అయినవోలు నాగరాజు, శర్మ బాబాకు అర్చనలు అభిషేకాలు నిర్వ హించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు జున్ను తుల ఆదిరెడ్డి, బూరసతీష్, రేవూరి సంజీవరెడ్డి, కరివేద మహేందర్‌రెడ్డి, సము ద్రాల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికకు నోటిఫికేషన్

నవతెలంగాణ-ఐనవోలు

ప్రభుత్వాదేశానుసారం ఉడుత గూడెం ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసి ఎన్నికల నోటిఫికేషన్ ను గ్రామసభలో గ్రామ సర్పంచ్ బరిగెల ఆరోగ్యం, ఉప సర్పంచ్ పెరుగు కిరణ్ కుమార్, గ్రామ కార్యదర్శి దీపిక, వార్డుసభ్యులు తాటికాయల ఆనందం సమక్షంలో హెచ్ఎం చుంచుకాల లింగారావు విడుదలచేసి గ్రామపంచాయతీ నోటీసు బోర్డు, పాఠశాల నోటీసు బోర్డులలో నోటిఫికేషన్‌ను ప్రదర్శించారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 29న ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎన్నుకొని, ఆ సభ్యుల నుండి చైర్మన్, వైస్ చైర్మన్ లను ఎన్నుకొన్న తర్వాత మొదటి సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చౌటపల్లి మాజీ ఎంపీటీసీ రాజబోయిన శ్రీనివాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస నాయక్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, నాయకులు గడ్డం జనార్ధన్, లచ్చు నాయక్, కుమార్‌రావు, వెంకటేశ్వరరావు, సదయ్య, భాస్కర్ నాయక్, జిల్లా కనకయ్య, చల్ల వెంకన్న, గడ్డం కుమార్, సన్నీ, శ్రీనగర్ వెంకన్న, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మత రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలి

- ఫిబ్రవరి 16న అఖిల భారత సమ్మె : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

కేంద్ర ప్రభుత్వ మతతత్వ రాజకీయాలను ప్రజలు తిప్పి కొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్ సుందరయ్య భవన్ లో శనివారం సీఐటీయు, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల జిల్లాసదస్సు సారంపల్లి వాసుదేవరెడ్డి, టీ.ఉప్పలయ్య, ఎం.శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ జిల్లా సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్ మాట్లాడుతూకేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. రైతులకి మద్దతు ధర ప్రకటించడంలో వ్యవసాయ కార్మికులకు గ్రామీణ ఉపాధి హామీ నిధులను పెంచడంలో ప్రభుత్వము విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్ మతోన్మాదనయా ఉదారవాద విధానాలవలన ప్రజలు కార్మికవర్గం రైతాంగం పేద ప్రజల నుండి వచ్చే వ్యతిరేకత ను గుర్తించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మతరాజకీయాలకు తెరలేపుతూ అయోధ్య రామ మందిరాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ , విద్యుత్ సంస్కరణ బిల్లు, కార్మిక చట్టాల మార్పు, నేషనల్ మానిటైజేషన్ , జీఎస్టీ , ఇలా అనేకరకాల చట్టాలు తీసుకొచ్చి ప్రజల ఆస్తులను దోచి పెట్టుబడుదారులు, కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ వారికి లాభంచేకూర్చేవిధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు ఉన్నాయన్నారు. బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టడంలో భాగంగా దేశంలోని కార్మికవర్గం, రైతాంగం, ప్రజలందరినీ చైతన్యం చేయడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్తంగా ఫిబ్రవరి 16 న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు.

జిల్లాల్లో ఉన్న స్కీమ్ వర్కర్లు, ప్రజలు, రైతులు, కార్మికులు, కర్షకులు,విద్యార్థులు, మేధావులు అందరూ గ్రామీణబంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాములు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య, సిఐటియు నాయకులు గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, బొట్ల చక్రపాణి, గొడుగు వెంకట్, కే.లింగయ్య, వేల్పుల సారంగపాణి, పుల్ల అశోక్, చిలుక రాఘవులు, పద్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి రూపురేఖలు మారుస్తా : మంత్రి పొన్నం

నవతెలంగాణ-ఎల్కతుర్తి

ఎల్కతుర్తి ముఖచిత్రాన్ని త్వరలో మారుస్తానని బీసీ సంక్షేమశాఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 35 ఏళ్ల రాజకీయ జీవితంలో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రిగా చేశారన్నారు. ఐదేళ్లలో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని తెలంగాణలోనే మోడల్‌గా చేస్తానన్నారు. దానికి ముఖద్వారం అయినా ఎల్కతుర్తి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. గత పాలకులు ఖజానాను ఖాళీచేసి అప్పగించారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు హామీలను కచ్చితంగా 100 రోజుల్లో అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మిపథకం కింద రెండు అమలు చేశామన్నారు. త్వరలోనే మరో రెండు అమలు అవుతాయన్నారు. 100రోజు ల్లోగా 6పథకాలను అమలు చేసి నిరూపిస్తామన్నారు. రాజకీయాల్లో గెలిచే వరకే పార్టీలు, గెలిచిన తర్వాత పార్టీలకు అతీతంగా పని చేద్దామని హితవ్ పలికారు. ఈ కా ర్యక్రమంలో జెడ్పీచైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్‌కు మార్, ఎంపీపీ మేకల స్వప్న వైస్ ఎంపీపీ నగేష్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, సర్పంచ్ కొ మ్మిడి నిరంజన్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బూర్గుల రామారావు, ఎంపిటిసిల పోరం అధ్యక్షుడు కడారి రాజు, ఎమ్మార్వో జగత్ సింగ్, ఎంపీడీవో సునీత, ఉపసర్పంచ్ వల్ల శ్వేత తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌వీఎస్‌లో రెండురోజుల స్ప్రింగ్ ఫైర్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఎస్‌వీఎస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10,11 తేదీలలో రెండు రోజుల పాటు స్ప్రింగ్ ఫైర్-2024 నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్ రావు భీమారంలోని విద్యాసంస్థల ప్రాంగణంలో ఫెస్ట్ కు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమల్ రావు మాట్లాడుతూ స్ప్రింగ్ ఫైర్ ఫెస్ట్ లో ఇంజనీరింగ్,ఫార్మసీ,పాలిటెక్నిక్,మేనేజ్మెంట్ విద్యార్థులకు డాన్స్, సింగింగ్,ఫేస్ పెయింటింగ్, కోడింగ్ కాంపిటీషన్స్ తదితర విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవతరగతి విద్యార్థులకు మాడల్ పాలిసెట్ పరీక్ష,ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాడల్ ఎంసెట్ పరీక్ష ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఉచిత రిజిస్ట్రేషన్ కల్పించామని, 18 సంవత్సరాలు పై బడిన విద్యార్థులు రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని స్ప్రింగ్ ఫైర్ లో పాల్గొనవచ్చున్నారు. ఈ పోటీలలో వివిధ కాలేజీల్లో చదువుతున్నఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, మేనేజ్మెంట్ విద్యార్థులతో పాటు డిగ్రీ విద్యార్థులు పాల్గొనవచ్చున్నారు. ఈనెల 27న లండన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ డెవల ప్మెంట్, ఎస్వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సంయుక్తంగా అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని, దేశ విదేశాల నుండి హాజరైన పరిశోధకులు పరిశోధన పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్,డీన్లు,విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో జర్నలిజం పాత్ర కీలకం : ప్రొఫెసర్ సురేష్‌లాల్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

సమాజ నిర్మాణంలో జర్నలిజం పాత్ర కీలకమని కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్ లాల్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ కోర్స్ 2023-25 విద్యా సంవత్సరంలో చదువుతున్న ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం సమావేశం సీనియర్ విద్యార్థులు నిర్వహించారు. జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ సభకు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా యునివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ లాల్ హాజరై మాట్లాడుతూ జర్నలిజం మొదటి సంవత్సరం విద్యార్థులు తమ రెండేళ్ల అనంతరం బయటకు వెళ్లి జీవితంలో స్థిరపడడంతో పాటు సమాజంలోని అనేక రుగ్మతలు, సమస్యలపై దృష్టిసారించి, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వంకు సలహాలు ఇచ్చే విధంగా ఉండాలన్నారు. జర్నలిజం విద్యార్థులు తమ విద్యాభ్యాసం అనంతరం సమాజం కార్యక్షేత్రంగా చేసుకొని పనిచేయాలని సూచించారు. పాఠ్యాంశాలతో పా టు సమాజంలో చోటు చేసుకునే అనేక పరిణామాలనుచూసి స్పందించి మీడియాలో రాయడంద్వారా సమాజం అణగారిన వర్గాలకు బాసటగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయంకు ఎంతో ఉద్యమ చరిత్రతో పాటు సామాజిక బాధ్యత ఉందన్నారు. కేయూకు ఉన్నత చదువుల కోసం వచ్చే విద్యార్థులకు అధ్యాపకులకు ఆత్మీయ బంధం ఏర్పడుతుందని అన్నారు. జర్నలిజం విద్యార్థులల్లో సజనాత్మకత శక్తి వత్తి లో ప్రజల పక్షాన నిలిచి పోరాడేధైర్యం ఉండాలన్నారు. దీనికి తోడు వారికి వృత్తి పరమైన పరిజ్ఞానం నూతన సాంకేతిక పరిజ్ఞానంను అలవర్చుకోవడంతోపాటు ఇంగ్లీష్ స్కిల్స్ ను మెరుగుపరచుకోవాలని సూచించారు. శివకేర్ రాసిన యుకేవిన్ లాంటి మరెన్నో మంచి పుస్తకాలు చదవాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జర్నలిజం విభాగ అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ ఐటీరంగంలో ఉన్న వారికి ఉద్యోగాలు రాకపోయినా జర్నలిజం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. తమ విద్యార్థులకు ప్రింట్ ఎలక్ట్రానిక్‌తో పాటు సోషల్ మీడియా సినిమా నిర్మాణ రంగంలో అడ్వర్టైజ్మెంట్ ప్రజా సంబంధాల శా ఖలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగ ఫ్యాకల్టీ కంజర్ల నరసింహారాములు, దడబోయిన శ్రీకాంత్ యాదవ్ , పి.పద్మ, పెరుమల్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ శంకర్, ఈర్ల సురేందర్, మోటే చిరంజీవి, సీనియర్ విద్యార్థులు సురేష్ నాయక్,మానస, శివాజీ, సంతోష్, హరీశ్, మల్లేష్, శివలీల,స్నేహ, కళ్యాణి ప్రథమ సంవత్సర విద్యార్థులు అన్నపూర్ణ, ప్రభాకర్, రాణి మౌనిక , లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలి

- టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు



నవతెలంగాణ-దామెర

ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు విడుదల కరువుభత్యాన్ని వెంటనే విడుదల చేయాలని టిఎస్ యుటిఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఓగులాపూర్ మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ వాల్‌క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని పెండింగ్లో ఉన్న మూడు విడుదల కరువుభత్యాన్ని మంజూరు చేయాలని అన్నారు. అలాగే మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలల పని వేళలను మార్పు చేయాలని గురుకుల పాఠశాలలో కేర్‌టేకర్లను నియమించాలని వారికి వైద్య కార్డులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పదోన్నతులకు ఆటంకంగా ఉన్న టెట్ నుంచి మినాయింపు ఇవ్వాలని వెంటనే బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సృజన, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ జర్నలిస్టులకు అండగా ఉంటాం

- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు



నవతెలంగాణ-హనుమకొండ

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పరిధిలోని ఉర్దూ జర్నలిస్టులకు అండగా ఉంటామని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. ఇటీవల ఎన్నికైన తెలంగాణ ఉర్దూ జర్నలిస్ట్ ఫెడరేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులను శనివారం వరంగల్ ప్రెస్ క్లబ్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా ఉర్దూ జర్నలిస్టులు ఒక్కటై ఎన్నిక నిర్వహించుకోవటం శుభపరిణామమని అన్నారు. క్లబ్ తరఫున ఏ సహాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నూతనంగా ఎన్నికైన ఉర్దూ జర్నలిస్టుల ఫెడరేషన్ అధ్యక్షుడు ఎండీ సాజీద్, కార్యదర్శి ఎంఏ నయీం, కోశాధికారి ఎండీ అమీర్ లను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సాదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ లు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు యంసాని శ్రీనివాస్, దుర్గాప్రసాద్, సహాయకార్యదర్శి సుధాకర్, ఈసీ మెంబర్ ఎండీ నయీం, ఐజేయూ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, మాజీ కార్యదర్శి కంకణాల సంతోష్, ఉర్దూ జర్నలిస్ట్ ఫెడరేషన్ బాధ్యులు వహీద్ గుల్షన్, ఎంఏ సయీద్, ఇస్మాయిల్ జబీ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హన్మకొండలోని సురక్ష ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ బ్రాంచ్ బాలసముద్రం కార్యాలయంలో నూతన సంవత్సర 2024 క్యాలెండర్స్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించినట్లు సురక్ష ఇన్ఫ్రా ప్రాజెక్ట్ డైరెక్టర్స్ రాజారత్నం కొల్లూరి, మద్రి వెంకటేశ్వర్లు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కస్టమర్లకు మెరుగైన,నాణ్యమైన సేవలను అందించాలని సురక్ష ఇన్ఫ్రా ప్రాజెక్ట్ సీనియర్ మార్కెటింగ్ అసోసియేట్స్ కుటుంబ సభ్యులను కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ మార్కెటింగ్ అసోసియేట్స్ సభ్యులు జి.గోపి,మహమూద్ అలీ, కే.ఆరోగ్యం, ఆర్‌డి.స్వామి,జి. వెంకటేష్, రాసకట్ల శ్రీనివాస్, డికెన్, సత్యనా రాయణ, గిరీష్, నరేష్‌యాదవ్, యాదగిరి, ప్రవీణ్, సహజా రెడ్డి,సుమలత, అడ్మిన్ స్టాఫ్ శరత్,సారిక సుజాత, శిరీష, దివ్య సురక్ష ఇన్ఫ్రాప్రాజెక్ట్స్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మనువాద పాలకులను ఓడించండి : ఆర్ఎస్‌పీ

నవతెలంగాణ-పర్వతగిరి

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మనువాద పాలకులను ఓడించాలని ఆర్ఎస్‌పీ రాష్ట్రకమిటీ సభ్యులు,వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మనువాద భావజాలాన్ని పెంపొందిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తుందని బిజెపి కుట్రలు, కుతంత్రాలను మేధావులు,సామాజిక కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు తిప్పి కొట్టాలన్నారు.

బాధిత కుటుంబానికి సర్పంచ్ పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని రావూరులో గూగులోతు రాములు శనివారం మృతి చెందగా సర్పంచ్ బండి సంతోష్‌కుమార్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అమ్మిలాల్, బీ ఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు గడ్డి యాకయ్య, పంచాయతీ కార్యదర్శి దేవిలాల్, నాగరాజు, రమేష్ చందూలాల్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులు



నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్, నాబార్డు ఆధ్వర్యంలో చౌట పల్లి సొ సైటీ పరిధిలో శనివారం పర్వతగిరి సొసైటీ పరిధిలోని అన్నారం షరీఫ్, రావూరు, కల్లెడగ్రామాల్లో జిల్లా సహకార బ్యాంక్ వారి సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతగిరి డబ్ల్యూ డిసిసిబి శాఖ మేనేజర్ జె.వినీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌లు మనోజ్ కుమార్, గొర్రె దేవేందర్, సూపర్వైజర్ సుధాకరచారి,సి ఇ ఓ సురేష్,సిబ్బంది వెంకట్,సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-నల్లబెల్లి

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పిఆర్టియు డైరీని ఎంపీపీ ఊడుగుల సునీత ప్రవీణ్ గౌడ్, ఎంపీడీవో విజయ్ కుమార్‌లు ఆవిష్కరించారు. అనంతరం టిఆర్టియు డైరీని స్థానిక ఎస్సై నగేష్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నకిరెడ్డి మహేందర్, ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పోలోజు బిక్షపతి, చిట్టిరెడ్డి తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కుల సుభాష్, ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి పొగాకు అచ్చయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చీరాల మలయ్య కార్యదర్శి, వెంకటరమణరసయ్య, మండల కార్యదర్శి భానోత్ కష్ణ, సీనియర్ ఉపాధ్యాయులు పురం బద్రీనాథ్, కస్తూరిబా ఉపాధ్యాయులు సరిత, ఉష, జ్యోతి, వెంకటేశ్వర్లు, సి ఆర్ పి వైనాల రవి తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో క్యాలెండర్ ఆవిష్కరణ

వేలేరు : మండల కేంద్రం వేలేరులోని మండల విద్యా వనరుల కేంద్రంలో పిఆర్టియు- తెలంగాణ క్యాలెండర్‌ను హనుమకొండ జిల్లా అధ్యక్షులు భీమోజు రాజేశ్వరయ్య చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రావులకారు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, సిఆర్పి మొగిలిచర్ల శ్రీనివాస్, చంద్రరాజు వెంకటేష్, రాజ్ కుమార్ మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జనగామ
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

కొమ్మూరి ఇంట మంత్రులకు అల్పాహార విందు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామకు వచ్చిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, ఇతర ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇంట అల్పాహార విందును ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం ఏర్పాటు చేసిన ఈ అల్పాహార విందుకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి, స్టేషన్‌ఘన్పూర్ ఇన్చార్జ్ సింగపురం ఇందిర, ఎమ్మెల్యే రామచంద్రనాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'నవతెలంగాణ' : ఆర్డీఓ

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



ప్రజా సమస్యల పరిష్కారానికి 'నవతెలంగాణ' కృషి చేస్తుందని స్టేషన్‌ఘనపూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి వాసం రామ్మూర్తి అన్నారు. శనివారం తన కార్యాలయంలో నవతెలంగాణ దినపత్రిక 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ భావాలు కలిగిన నవతెలంగాణ దినపత్రిక పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిర్విరియామంగా కృషి చేస్తుందని కొనియాడారు. ప్రజాస్వామ్య పాలనలో పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా పత్రికలు యదార్థ ప్రత్యేక కథనాలు రాయాలని సూచించారు. ప్రభుత్వానికి సూచనలు చేయడంలో పత్రికలు కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. సమాజంలో దినపత్రికలు నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, విలేకరి కొంగరి అర్జున్, సాకి సాంబమూర్తి, కూషమల్ల రవి పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మత్తును పూర్తి చేయాలి

- నిర్లక్ష్య కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మండలంలోని ఇప్పగూడెం, రంగరాయ గూడెం మీదుగా కోమటిగూడెం వెళ్లే రహదారి మరమత్తు పనుల్లో కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సత్వరమే పనుల్ని పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డు పనుల్ని పరిశీలించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేండ్లు గడుస్తున్నా రోడ్డు పనులను చేయకపోవడం వలన వాహనదారులకు ఇబ్బందిగా మారిందన్నారు. కొత్తగా రోడ్డు మరమ్మత్తుల పనుల చేపట్టి సుమారు 6 నెలలు కావస్తున్నా కాలయాపన చేస్తున్నారన్నారు. మరో నెల రోజుల్లో ఇప్పగూడెం, కోమటిగూడెం, రంగరాయగూడం గ్రామాల పరిధిలో సంయుక్తంగా నిర్వహించే చింతగట్టు సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమవుతుందని జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కల్గకుండా సదరు కాంట్రాక్టర్ పై, సంబధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కోడెపాక యాకయ్య, ఇప్పగూడెం గ్రామ కార్యదర్శి గట్ల మల్లారెడ్డి, రంగరాయిగూడెం కార్యదర్శి మంద ఇలిషన్, కోమటిగూడెం కార్యదర్శి ఈదునూరి యాకయ్య, మండల గ్రామ నాయకులు కత్తుల రాజు, మునిగే నర్సింహులు, మారబోయిన మల్లయ్య కుర్ర ఉప్పలయ్య, వంగపండ్ల సోమయ్య, ములుకుంట్ల రాజు, యాదగిరి, పిట్టల శ్రీను, సట్ల రాజు, రామగోని సతీష్, పోలాసు కిష్టయ్య, కరుణాకర్, శాతపురం రవి పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మండలంలోని తాటికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన, చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమా సుధీర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కరపత్రావిష్కరణ చేశారు. ఈనెల 26న ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు మండల కన్వీనర్ అక్కనపల్లి అంజయ్య, రజక సంఘం నాయకులు సత్తయ్య, వెంకటయ్య తెలిపారు. రజక సంఘం రాష్ట్ర, జిల్లా శ్రేణులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి ఐలోని సుధాకర్, దేవస్థాన చైర్మన్ మేకల మల్లేశం, మాజీ ఎంపీటీసీ బాలు, కుసుమ రమేష్, మాజీ ఉప సర్పంచ్ సిద్దుల సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి జిల్లెల్ల శేఖర్, ఉపసర్పంచ్ రాములు, పొన్న శ్రీనివాస్, నాగరాజు, రాజు, తాటికొండ సంపత్, ఎడమ శంకర్, రమేష్, వార్డు సభ్యులు రొయ్యల కనకయ్య, మోతకాని రాజేశ్వర్, సాదం రాములు, పోకల నారాయణ, రామచంద్రారెడ్డి. దామెర ఎల్లయ్య, అనిల్, రవి పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి : డీటీఎఫ్

నవతెలంగాణ-పాలకుర్తి

సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి 10 సంవత్సరాలుగా గత ప్రభుత్వ హయాంలో పరిష్కరించని ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను చర్చించి పరిష్కరించాలని జనగామ జిల్లా డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎండి.షరీఫ్ కోరారు. 2024 సంవత్సరానికి సంబంధించిన డిటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జిల్లా మండల కమిటీ బాధ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షులు చిదురాల శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన విద్యారంగాన్ని గాడిలో పెట్టి ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి లాంటి కార్యక్రమాలను సమీక్షించి, విద్యారంగాన్ని కాపాడి, ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు చేపట్టి కొత్త డీఎస్సీ నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ మండల బాధ్యులు పి.కమలాకర్ రెడ్డి, డి.సూర్య ప్రకాష్, ఎం.శ్రీనివాస్, ఏ.శ్రీకాంత్, సంఘం సీనియర్ సభ్యులు ఎం.వెంకటేశ్వర్లు, సదానందం, రమేష్, మధుకర్, గూడూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

చిల్పూర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో సేనర్జియా గ్రూపు చైర్మన్ బ్రదర్ జాన్ ఆధ్వర్యంలో ఎంజీఎం ఆసుపత్రి స్టాఫ్ నర్సు దార ప్రేమలత జన్మదిన సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధులకు సేవ చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మోజెస్ రావు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కొయ్యడ శోభారాణి, గ్రూపు కో ఆర్డినేటర్స్ శ్రీను, మిన్ను, తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్యకు జీఎంపీఎస్ నాయకుల నివాళులు

నవతెలంగాణ-రఘునాథ్‌పల్లి

మండలంలోని అశ్వారావుపల్లి గ్రామానికి చెందిన గద్ద రాజు గొర్రెల మేకల పెంపకందారుల సంఘం మండల కార్యదర్శి తండ్రి గద్ద కొమురయ్య (80) మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను జీఎంపీఎస్ నాయకులు శనివారం పరామర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మోటే దేవేందర్, కార్యదర్శి సాదం రమేష్, ఉపాధ్యక్షులు, మండలాధ్యక్షులు గుండ వెంకటయ్య, మాయ రాములు, పెద్దగోళ్ల దండిగా పెద్ద రాములు, చారిగొల్ల గాజుల మల్లయ్య, దండిగా కుమార్, గాజుల రామయ్య, మంద బుచ్చయ్య, గద్ద లక్ష్మయ్య, గద్ద చిన్న కొమురయ్య, ఇస్కిల్ల స్వామి, ఇస్కిల్ల వెంకటయ్య, గొర్ల రాజయ్య, మంద రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో అందరూ భాగస్వాములు కావాలి

- మంత్రులకు జనగామలో ఘన స్వాగతం

నవతెలంగాణ-జనగామ



తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ప్రజల ప్రభుత్వం ఏర్పడిందని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా శనివారం జనగామ జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండ సురేఖలను డిసిసి ప్రెసిడెంట్ కొమ్మూరు ప్రతాపరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ, జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అలాగే జనగామ జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, వెస్ట్ జోన్ డిసిపి సీతారాం, ఏసీబీ దేవేందర్ రెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం అల్పాహార విందులో పాల్గొన్నారు. అలాగే జిల్లా ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన సాగుతుందన్నారు. ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజాభిప్రాయాలకుఅనుకూలంగా ప్రజాప్రభుత్వం నడుచుకుంటుందన్నారు. అధికారులందరూ ప్రజల కోసం పనిచేయాలన్నారు. మంత్రులతో కాంగ్రెస్ నాయకులు వేముల సత్యనారాయణ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికి ఇందిరా, హాయ్ సుధాకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం : అటవీ అధికారి జోగేందర్

నవతెలంగాణ-ములుగు

ఆరోగ్యమే మహాభాగ్యమని అటవీ శాఖ ములుగు డివిజన్ అధికారి జోగేందర్ తెలిపారు. లయన్స్ క్లబ్ ములుగు, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ వివేకానందపురం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ములుగు జిల్లా ఆసుపత్రి వారి సహకారంతో ములుగు జిల్లా అటవీ శాఖాధికారి రాహుల్ కిషన్ జాదవ్ అభ్యర్థన మేరకు జిల్లా ఆసుపత్రిలో జిల్లా అటవీ శాఖ సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన ములుగు డివిజన్ అటవీ అధికారి జోగిదర్ మాట్లాడుతూ రాత్రి, పగలు అడవులలో తిరుగుతూ వాటిని సంరక్షించే సిబ్బందికి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటం చాలా ముఖ్యమని, అందుకే ఎవరికైనా ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తెలిస్తే జాగ్రత్త పడతారనే ఉద్దేశ్యంతో లయన్స్ క్లబ్ పింగిలి నాగరాజుని సంప్రదించగా ములుగు క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ పూజారి రఘు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ వెంటనే స్పందించి వైద్య పరీక్ష శిబిరం నిర్వహణకు ముందుకు వచ్చారని, వారికి తమ శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో టీ-హబ్ ద్వారా అటవీ సిబ్బందికి వివిధ రక్త పరీక్షలు, బీపీ, షుగర్, కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి రక్త నిధికి రక్త దానం చేసిన అటవీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజు వైద్య శిబిరం ద్వారా ములుగు డివిజన్ పరిధిలోని 90 మంది అటవీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించగా లయన్స్ క్లబ్ వారు ఉచితంగా మందుల పంపిణీ చేశారు.



రక్తదానం చేసిన అటవీ సిబ్బంది

రక్త నిధిలో కొరత దృష్ట్యా రక్త దానం చేయమని సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ అభ్యర్థన మేరకు స్పందించిన డివిజన్ అటవీ అధికారి జోగేందర్ స్వయంగా రక్తదానం చేసి స్ఫూర్తి నింపగా అటవీ సిబ్బంది 13 మంది రక్తదానం తమ సహృదయాన్ని చాటుకున్నారు. ఈకార్యక్రమంలో వివేకానందపురం క్లబ్ డైరెక్టర్ పింగిలి నాగరాజు, ములుగు క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ పూజారి రఘు, చుంచు రమేష్, కొండి సాంబశివ, సానికొమ్ము రవీందర్ రెడ్డి, ఉదయ్, బలరాం రెడ్డి, సుబ్బారెడ్డి, ఆసుపత్రి వైద్యులు ప్రవీణ్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, సుజిత్ కుమార్, సతీష్, భరత్, సంబంధిత శాఖల పీజీ వైద్య విద్యార్థులు, పారా మెడికల్ సిబ్బంది, ములుగు డివిజన్ అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గట్టమ్మ వద్ద వేస్తున్న టెండర్లు రద్దు చేయాలి

- ములుగు డీఎల్పీఓను సస్పెండ్ చేయాలి
- ఆదివాసీ నాయకపోడు జిల్లా అధ్యక్షులు కొత్త సురేందర్

నవతెలంగాణ-ములుగు

ఆదివాసీ నాయకపోడు హక్కులను కాలరాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి నాయకుడు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసి నాయకుడు జాకారం గట్టమ్మ దేవాలయం వద్ద గట్టమ్మ పూజారుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త సురేందర్ మాట్లాడుతూ గట్టమ్మ వద్ద ఆదివాసి నాయకపోడ్ పూజారుల ఆధ్వర్యంలో గ్రట్టమ్మ మహా జాతర ప్రతీ సంవత్సరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహా జాతర సందర్భంగా గట్టమ్మ జాతర వద్ద వేస్తున్న టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న అధికారులతో సమన్వయ సమావేశం జాకారం గ్రామపంచాయతీ, గట్టమ్మ పూజారులతో ఏర్పాటు చేయడం జరిగిందని, సమావేశంలో ఆదివాసి నాయకపోడ్ గట్టమ్మ పూజారుల డిమాండ్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. డిమాండ్లను పరిశీలించిన అధికారులు సమన్వయంతో గట్టమ్మ జాతరను విజయవంతం చేస్తామని తెలిపారని, మా డిమాండ్లను విని అధికారులు మాకు ఏమి చెప్పకుండానే గట్టమ్మ వద్ద టెండర్లను నిర్వహిస్తున్నట్లు పాంప్లెట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. అధికారులకు తెలియకుండా జాకారం గ్రామ



పంచాయతీ నాయకులతో టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిసిందన్నారు. ములుగు డిఎల్ పిఓ స్వరూపారాణి టెండర్ల ప్రక్రియను ఏకపక్షంగా నిర్వహిస్తున్నారన్నారు. మా హక్కులను కాలరాస్తున్న డీఎల్పీవో స్వరూప రాణిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం తరపున డిమాండ్ చేశారు. టెండర్లు రద్దు చేయని ఏడల జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆదివాసి నాయక పోడ్ కులస్తులందరూ కలిసి కలెక్టర్ కార్యాలయంను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారులు కొత్త సదయ్య, కొత్త లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, ఆకుల పుల్లయ్య, కొండపాడుచయ అర్రికల సంజీవ, ఆకుల రఘు, ఆకుల రాజు, అచ్చ రాజు, చిర్ర సంతోష్, కొత్త రవి, మండప సురేష్, అరిగెల రఘు, కొత్త రాజకుమార్, కొత్త రాజేష్, అరిగెల పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి కోసం రోడ్డెక్కిన రైతులు

- చిరుతపల్లి వద్ద రాస్తారోకో - స్తంభించిన రాకపోకలు
- అధికారుల హామీతో శాంతించిన రైతులు

నవతెలంగాణ-వెంకటాపురం

పాలెం ప్రాజెక్టు ఆయకట్టు సాగురైతులకు నీరు అందక వేలాది ఎకరాల పంట నష్టం జరిగిందని, ప్రాజెక్టు కాలువల మరమ్మత్తులు చేపట్టి రైతుల పంట నష్టపోకుండా ఆదుకోవాలని పాలెం ప్రాజెక్ట్ డీఈఈ, ఏఈలకు పలుమార్లు వినతులు చేసుకున్న అధికారుల తీరు మరకపోవడంతో విసుగు చెందిన చిరుతపల్లి, బర్లగూడెం పంచాయితీ లరైతులు వెంకటాపురం-వాజేడు ప్రధాన రహదారిపై చిరుతపల్లి వద్ద రాస్తారోకో చేశారు. రెండు గంటలకు పైగా రోడ్డుపై బైఠాయించడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న మండల పరిషత్ అధికారి బాబు,ఎస్సై తిరుపతిరావులు సంఘటన ప్రాంతానికి వెళ్లి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా బర్లగూడెం సర్పంచ్ నరసింహమూర్తి, ఏఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించేందుకు పాలెం ప్రాజెక్టు నిర్మించారు. కాలువల మరమత్తులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రతీ వర్షాకాలం చిన్న గంగారం వద్ద ప్రధాన కాలువకు ప్రతీ ఏడు గండి పడుతుందన్నారు. అధికారులు పాలెం ప్రాజెక్టు పై పెట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాలువ గండి పడిన ప్రతీసారి రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేస్తున్నాయన్నారు. తొలగించుకునేందుకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. భైరి కార్తీక్



పొలంలో ఇసుక మేటలు తొలగించాలని అధికారులకు వినతిపత్రం ఇస్తే నీ సొంత సొమ్ములతో పొలం బాగు చేసుకో అని అధికారులు నిర్లక్ష్యంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఖరీఫ్‌లో4700 ఎకరాలకు, యాసంగిలో 2200 ఎకరాలకు నీళ్లు అందిస్తున్నట్లు అధికారులు తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ఎండి పోతున్న పంటలకు తక్షణమే నీళ్లు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సంఘటన ప్రాంతానికి చేరుకున్న ఏఈ కార్తీక్ రైతులకు నచ్చ జెప్పే ప్రయత్నం చేయకుండా అనుచిత వ్యాఖ్యలుచేయడంతో అతనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గమనించి ఎస్సై తిరుపతి రావు, ఎంపీడీవో బాబులు రైతులకు నచ్చ జెప్పారు. ఈ ఆందోళనలో అట్టం సత్యం, ఇర్ప బాబు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, వాసం నారాయణ, రమేష్, శివ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆరు నెలలుగా వేతనాలు రాక అవస్థలు

నవతెలంగాణ-గణపురం

మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి దీనస్థితిలో ఉంది. సరైన టైముకు జీతాలు రాక ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో మగ్గుతున్నారు. గత ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో అప్పులు తెచ్చి వంటలు పండుతున్నట్లు మధ్యాహ్న కార్మికులు బోరుమన్నారు. ప్రస్తుతం గుడ్ల రేటు ఏడు రూపాయలు ఉందని తమకు మాత్రం ఐదు రూపాయలు మాత్రమే కట్టిస్తున్నారన్నారు. అది కూడా సంవత్సరం నుండి ఆ బిల్లును రాక అప్పులు తీసుకువచ్చి పిల్లలకు వండి పెడుతున్నామన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు కావలసిన వసతులు కల్పించలేదన్నారు. వంట సామాగ్రిలేదని, గ్యాస్ పొయ్యిలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరిగేనా అని ఎదురుచూస్తున్నట్లు వారు తెలిపారు. మండలంలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు చేసేదేమీ లేక ధర్నా చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికులు అల్లం సుగుణ, మార్త వెంకటలక్ష్మి, దూలం పద్మ, నారగాని మాధవి తెలిపారు. విద్యార్థులకు గుడ్ల రేటు పెరగడం వల్ల గుడ్లు గెలిపివేస్తామని చెప్పితే సంబంధిత హెడ్మాస్టర్లు కచ్చితంగా గుడ్డు పెట్టాలని ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పెరిగిన రేట్లకు తాము ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ జిల్లా కార్యదర్శి బందు సాయిలు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బందు సాయిలు తెలిపారు. ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం గుడ్ల ధర 7 రూపాయలు మార్కెట్లో ఉందని వీళ్లకు మాత్రం ఐదు కట్టివ్వడం వల్ల ఒక్క గుడ్డుకు రెండు రూపాయల చొప్పున నష్టం పోతున్నారని ఆ డబ్బులు వీరికి ఎలా వ



స్తాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలన్నారు. లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మధ్యన భోజన కార్మికులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.



మారాలి బహుజన వీడియో సాంగ్ చిత్రీకరణ

నవతెలంగాణ-జనగామ

కల్చరల్ క్రియేటివ్ ఛానల్ జనగామ (సిసిసి) ఆధ్వర్యంలో యువ కవి జెఎస్కె ట్యూన్స్ అధినేత, సంగీత దర్శకులు చిలుమోజు సాయికిరణ్ రచించిన మారాలి బహుజన పాట శనివారం జనగామ జిల్లా కేంద్రంలో చిత్రీకరించారు. బహుజనుల ఐక్యతను కాంక్షిస్తూ 4నిమిషాల నిడివి గల పాటను మ్యూజిక్ డైరెక్టర్ చిలుమోజు సాయికిరణ్ స్వరపరచగా గాయనీ మాద్గుల నిరోషా గానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ సర్వాయి పాపన్న, ప్రొఫెసర్ జయశంకర్ సర్ విగ్రహాల ఎదుట పాటకు అనుగుణంగా చిత్రీకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రజా వైద్యులు, కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ పాల్గొని బహుజనవాదంపై వస్తున్న ఈ పాట సందేశాత్మకంగా ఉందన్నారు. ఈనెల 26 ఈ పాట యూట్యూబ్‌లో విడుదల చేయడానికి సాంకేతిక బృందం సన్నాహాలు చేస్తుంది. ఈ చిత్రీకరణలో గాయనీ మాద్గుల నిరోషా, ఛాయాగ్రహణం నేనావత్ దశరథ్ నాయక్ లక్ష్మి ప్రసన్న ఫోటో స్టూడియో, గుడికందుల కృష్ణ, పెట్లోజు సోమేశ్వరా చారి, అయిలా సోమనర్సింహచారి, లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, పాగుల శ్రీనివాస్, కొట్టే శ్రీలత, బుదారపు లావణ్య, పొట్టబత్తిని శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేలపోగులలో శ్రీ రాముని అక్షింతల పంపిణీ

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని నేలపోగుల గ్రామంలో అయోధ్య రాముల వారి అక్షంతలను శనివారం పూజారి అవధాని ఆలేటి నరసింహమూర్తి, శ్రీ రాముల వారి అక్షంతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సర్పంచ్ దూసరి గణపతి చేతుల మీదుగా గ్రామ ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కందగట్ల సుదర్శన్, వడ్లకొండ పెంటయ్య అంజయ్య, బాలగాని అనిల్, వట్టిపల్లి సంపత్, గైని సోమశేఖర్, అబ్బగోని ప్రదీప్, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాలొన్నారు.



దూలమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే

నవతెలంగాణ-పాలకుర్తి

మండలంలోని దుబ్బ తండా (ఎస్) కేవులతండాకు చెందిన గుగులోతు దూలమ్మ బుధవారం మృతిచెందగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు, పాలకుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవనపల్లి విశ్వేశ్వర్, ఎస్సై తాళ్ల శ్రీకాంత్, జరుపుల బాలు నాయక్, శనివారం వేరు వేరుగా హాజరై మృతురాలు దూలమ్మ ఫోటోకు పూలమాలవేసి నివాళులు అర్పించి మృతురాలి కుమారులు రాములు, మండల నవతెలంగాణ రిపోర్టర్ గుగులోతు దేవోజీ, మనుమడు రమేష్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు డాక్టర్ మేడారపు సుధాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్, మాచర్ల ఎల్లయ్య, పిఎసిఎస్ బ్యాంకు వైస్ చైర్మన్ రాందాస్ పాల్గొన్నారు.



వెంకటాపూర్ మండల స్థాయి షటిల్ క్రీడలు

నవతెలంగాణ-ములుగు

వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలో మండల స్థాయి షటిల్ క్రీడలు నిర్వహించారు. విజేతలకు భారత జాగృతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పోరిక రవీందర్ శనివారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతీ రోజు వ్యాయామం చేయడం వల్ల అనారోగ్యానికి గురి కాకుండా ఉండవచ్చున్నారు. అనంతరం చిర్ర మహేందర్, దర్శన్‌లకు మొదటి బహుమతి రూ. 5016, వినీల్, రాజేందర్‌లకు ద్వితీయ బహుమతి రూ.3016, ఉత్తమ క్రీడాకారుడు సంతోష్‌కు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ముక్కెర తిరుపతి, చిర్ర సిద్దు, గంట రాజు, సంతోష్, లక్ష్మణ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

నవతెలంగాణ-గణపురం



మండలంలోని పరశురాంపల్లి గ్రామానికి చెందిన ఎర్రం శ్రీనివాస్‌కు చెందిన పాడి గేదె ప్రమాదవశాత్తు శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. శ్రీనివాస్‌కు చెందిన పాడి గేదె మేత కోసం చెల్పూర్ శివారులోకి వెళ్ళింది నీటిని తాగేందుకు వెళ్లిన క్రమంలో నీటి గుంతలో ఉన్న విద్యుత్తు మోటార్ ఫెయిల్ అయి పాడి గేదె షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన పాడి గేదే విలువ సుమారు లక్ష వరకు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గార్ల



పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం మండలాధ్యక్షులు చింతనిప్ప రమేష్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై జీనత్ కుమార్, సర్పంచ్ అజ్మీర బన్సిలాల్ ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నాయకులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంది వీరభద్రం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోట్ల నాగేశ్వరావు, పీఆర్‌టీయూ జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, నాగేశ్వరావు, పద్మావతి, మండల కార్యదర్శి భూక్య రమేష్ రాథోడ్, మాజీ ఎంఈవో జి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలకు వడ్డీలు చెల్లించాలి

- సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి

నవతెలంగాణ-బయ్యారం



సొసైటీలో పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీలు చెల్లించాలని సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామపంచాయితీ సింగారంలో రైతులతో ఆయన సమావేశమై మాట్లాడుతూ గతంలో సొసైటీలో పంట రుణాలను తీసుకున్న రైతులు తీసుకున్న రుణానికి వడ్డీలు కట్టి సొసైటి నుండి వచ్చే అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుగులోత్ మంగిలాల్, దోర పటేల్ సర్ధపక అశోక్, మేకల సీతారాములు, భద్రయ్య, రామస్వామి, డీలర్ కృష్ణ, తొట్టి కృష్ణ, ఈసల కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాతండాలో లోపించిన పారిశుద్ధ్యం..!

- పట్టించుకోని పాలకులు, అధికారులు

నవతెలంగాణ-మరిపెడ



మండలంలోని లక్షాత్మండా గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం లోపించింది. అంతర్గత రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. గ్రామంలో పలు వీధుల్లో పారిశుద్ధ్యం కూడా లోపించి దుర్వాసన వస్తుందని పాలకులు, అధికారులు గానీ ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తండాలో ఇంకుడు గుంతలు, సైడ్ కాల్వలు లేక పోవడంతో ఇండ్లల్లో నుంచి వచ్చిన మురికి నీరంతా కూడా వీధులపై ప్రవహిస్తుంది. ద్విచక్ర వాహనాలకు, ఇతర పెద్ద వాహనాలతో రోడ్లన్నీ గుంటలు గుంటలుగా ఏర్పడి నీరు నిల్వ ఉంటుందన్నారు. అదే విధంగా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్త చెదారం పేరుకపోయి దుర్వాసన వెదజల్లుతుందని తండవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తండాలో ఈగలు, దోమలు వ్యాపంచి పలువురు జ్వరం భారీన పడుతున్నట్లు తండావాసులు అధికారులపై మండిపడుతున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామానికి రాకపోవడంతో పాటు పారుశుద్ధ్యంపై దృష్టి సారించకపోవడతోనే గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టేల చర్యలు చేపట్టాలని తండవాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మానుకోటలో గణిత పోటీ పరీక్షలు

నవతెలంగాణ-మహబూబాబాద్



తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు టీఎంఎఫ్ మహబూబాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జడ్‌పిహెచ్ఎస్ మహబూబాబాద్ పాఠశాలలో మండల స్థాయి గణిత పోటీ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా అందులో ఇంగ్లీష్ మీడియం నుండి ప్రథమ బహుమతి ఎల్.నికిత జెడ్పిహెచ్ఎస్ ఈదుల పూసపల్లి,ద్వితీయ స్థానం ఎ.సాజని జెడ్పిహెచ్ఎస్ కంబాలపెల్లి, తృతీయ స్థానం పి.కౌశల్ జెడ్‌పిహెచ్ఎస్ కంబాలపల్లి, తెలుగు మీడియం నుండి ప్రథమ, ద్వితీయ ,తృతీయ స్థానాలు వరుసగా జి.హారిక, జె.స్రవంతి, జి.శ్రావ్య అందరు కూడా జెడ్‌పిహెచ్ఎస్ పర్వతగిరి నుండి గెలుపొందారని తెలిపారు. వారికి టీఎంఎఫ్ మహబూబాబాద్ మండల శాఖ తరపున నగదు ప్రోత్సాహంతో పాటు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎంఎఫ్ మహబూబాబాద్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎస్.రవి, కె.శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు కాసం శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి ఆర్.శ్రీధర్‌రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట్యా, వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణితంలో రాణిస్తే జీవితంలో ఉన్నత స్థానం

- నోడల్ ప్రధానోపాధ్యాయుడు బుదారపు శ్రీనివాస్

నవతెలంగాణ-పెద్దవంగర



గణితంలో ఎవరు రాణిస్తారో వారు జీవితంలో ఉన్నత స్థాయిలో నిలుస్తారని మండల నోడల్ ప్రధానోపాధ్యాయుడు బుదారపు శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ గణిత ఫోరం మండలాధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌ను శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గణితం మానవుల దైనందిన జీవితంతో ముడిపడి ఉందన్నారు. నిత్య సాధన ద్వారానే గణితంపై విద్యార్థులు పట్టు సాధిస్తారని చెప్పారు. సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగితే లక్ష్యం సాధిస్తారని చెప్పారు. కాగా మండలం నుండి పెద్దవంగర, అవుతాపురం, వడ్డెకొత్తపల్లి, బొమ్మకల్లు, చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటుగా, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో పెద్దవంగర, చిట్యాల విద్యార్థులు శ్యామిని, లోకేష్ ప్రథమ, రంజిత్ పెద్దవంగర ద్వితీయ, రాకేష్ అవుతాపురం తృతీయ స్థానంలో నిలువగా సింధుప్రియా,నానీలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సజావుగా పాఠశాల ఎన్నికలు చేపడుతాం : శ్రీనివాస్

నవతెలంగాణ-పెద్దవంగర



పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు సజావుగా చేపడుతామని మండల నోడల్ ప్రధానోపాధ్యాయుడు బుదారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామని, 24న ఉదయం 10 గంటలకు తుది ఓటర్ల జాబితా ప్రతి పాఠశాలలో నోటీస్ బోర్డుపై ఉంచుతామని చెప్పారు. ఈ నెల 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఎన్నికలు నిర్వహించి ఆ తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు. ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులు ఎన్నికలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, సదయ్య, టకీ పాషా, అంజయ్య, యాకయ్య, షౌకత్ అలీ, విజయ్ కుమార్, వెంకన్న, శ్రీనివాస్, సువర్ణ కరుణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

మండలంలోని టీవీ జర్నలిస్టు బోగోజు సురేష్ కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శని వారం వెల్లికట్టే శివారు పాలకేంద్రం వద్ద సురేష్ పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. శని వారం ఉదయం గుండెపోటుకు గురై జర్నలిస్టు మృతి చెందడం బాధాకరమని అతని కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగళపల్లి రామ చంద్రయ్య, కౌన్సిలర్లు, జర్నలిస్టులు నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటా

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని చింతలపల్లి గ్రామంలో మల్లమ్మ కుమారుడు మేకల సందీప్ గత కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించగా శనివారం అతని చిత్రపటానికి నివాళులర్పించారు. కంఠాయపాలెం గ్రామంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు శ్రీకాంత్ కొద్ది రోజుల క్రితం మరణించగా నివాళులు అర్పించి, అతని కుటుంబసభ్యులను ఓదార్చి,ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్‌పి ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పెరిగిన ధరలకనుగుణంగా సుతారీ కూలీ రేట్లు పెంపు

- వారం రోజుల పాటు చేపట్టిన సమ్మె ముగింపు

నవతెలంగాణ-గార్ల



ప్రస్తుతం పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికుల కూలీ రేట్లు పెంచడం జరిగిందని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ తెలిపారు. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని తెలంగాణ బిల్డింగ్,అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్వర్యంలో సుతారి మేస్త్రిలు, కూలీలు చేపట్టిన వారం రోజుల పాటు కొనసాగిన సమ్మె శనివారం కూలీ రేట్లు పెంపుతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ పార్కులో జరిగిన కూలీ ధరలు పెంపు చర్చలలో గత సంవత్సరం కంటే అదనంగా సుతారి మేస్త్రి కూలీ రేటు 75 రూపాయలు, సుతారి కూలీ రేటు 50 రూపాయలు పెంచడం జరిగిందని, పెంచిన కూలీ రేట్లు సంవత్సరం పాటు కొనసాగుతాయని చెప్పారు.పెంచిన సుతారి కూలీ రేట్లు తక్షణమే అమలులోకి వస్తాయని బిల్డింగ్ నిర్మాణదారులు, కాంట్రాక్ట్‌దారులు సహకరించాలని కోరారు.గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ ద్వారా ద్విచక్ర వాహనాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని, పట్టణంలో సుతారి కూలీ అడ్డాలను అన్ని వసతులతో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చలలో సంఘం నాయకులు, మేస్త్రిలు శ్రీను, మౌలానా, వీరయ్య, సత్యం, లల్లు, వెంకన్న, రవీందర్, బి.వెంకన్న, సత్తి, ఎల్లయ్య, మాధవరావు, నాగేశ్వరరావు, లాలు, ఏసు, యాదగిరి, సుతారి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మిల్లు హమాలీ కార్మికుల రేట్లు పెంపు

సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్టియూ

మహబూబాబాద్ : మిల్లు యజమాన్యాలు, యూనియన్ నాయకులు మేస్త్రీలు కలిసి చర్చలు జరిపి హమాలీ రేట్లు పెంచుకున్నట్లు సీఐటీయూ నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న తెలిపారు. శనివారం హమాలీ రేట్లపై చర్చించి యజమాన్యాలు, యూనియన్ నాయకులు కలిసి హమాలీ రేట్లపై 12 శాతంగా పెంచడం జరిగిందని ఈ ఒప్పందం రెండు సంవత్సరాలు అమల్లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మిల్లు యజమానులు గోపాల్, మదన్, నవనీతు, నరసింహారావు, దామోదర్, నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, రేషపెల్లి నవీన్, పర్వత కోటేషు, గొడుగు గుట్టయ్య, వెంకన్న, పర్వతాలు, రామ్మూర్తి సోమయ్య మేస్త్రీలు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు జయప్రదం చేయండి

నవతెలంగాణ-మహబూబాబాద్



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న జరిగే చెకుముకి సైన్స్ సంబరాలు జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కార్యదర్శులు తడకమర్ల బ్రహ్మం లింగంపల్లి దయానంద్ కన్వీనర్లు వెంపటి విజయ రాజు లింగాల ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. మహబూబాబాద్ జిల్లాలో ప్రతీ ఏటా 20 వేల మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజర వుతున్నారన్నారు. విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక , సమకాలీన సామాజిక అంశాలను, 8,9,10 తరగతిలోని సైన్సు, సోషల్ అంశాలను,జోడించి ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. ఈ పరీక్షకు విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యేలా సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానాచార్యులు, జిల్లా విద్యా యంత్రాంగం, జన విజ్ఞాన వేదిక మండలాల బాధ్యులు, సైన్స్‌ప్రేమికులు తోడ్పాటు నందించాలన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

తొర్రూరు : ప్రతీ విద్యార్థి తరగతి స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన కలిగి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని తొర్రూరు మండల నోడల్ ఆఫీసర్ మహంకాళి బుచ్చయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు రాయిపెల్లి యాకయ్య అన్నారు. జనవిజ్ఞాన వేదిక తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లా లక్ష్మీ నారాయణతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం చెకుముకి పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తుమ్మ వెంకటేశ్వర్లు, భాస్కరాచారి, పోగు శ్రీనుబాబు, తండ ప్రభాకర్, నిమ్మల వెంకటేశ్వర్లు, ప్రభాకర్, బి.వెంకటేశ్వరరావు, జేవీవీ బాధ్యులు ధరావత్ కిషన్ నాయక్, చంద్రమౌళి, లింగమూర్తి, చీకటి వెంకన్న, బిక్షపతి, శైలజ, సరిత, నాగయ్య, సైదులు, రమేష్, చంద్రశేఖర్, దయాకర్, ఎల్ల గౌడ్, యాకూబ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు కృషి

- పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు

పాలకుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకై ఎన్నారైల ద్వారా మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పిఆర్‌టియు నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంలో మన నియోజక వర్గంను రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా తీర్చి దిద్దుతామని తెలిపారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీశ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 10వతరగతిలో ఉత్తమ ఫలితల సాధనకు పిఆర్‌టియు కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆగిపోయినటువంటి పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని, 317 జీవోలో ఉపాధ్యాయులకు కలిగిన నష్టాలను తొలగించాలని, పెండింగ్ బిల్లులను త్వరిత గతిన వేయించాలని, బకాయి ఉన్న 3 డిఏలను ఇవ్వాలని, తొలిమెట్టు కార్యక్రమాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు విప్లవ రెడ్డి, ముత్తిలింగం, గెజిటెడ్ హెడ్ మాస్టర్ వేణు మాధవరెడ్డి, చీకటి వెంకన్న, దుబ్బాక శ్రీధర్ రెడ్డి, బుసాని సోమన్న కొల్లూరు అశోక్, వజినేపల్లి రమేష్, రేణుకాదేవి, కొండం వసుంధర, శ్రీనివాసా చార్యులు, నాగయ్య, వెంకటేశ్వర్లు, రఘు,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎసారెస్పీ కాలువ మళ్లింపు నిలిపివేయాలి

- బీఎస్పీ జిల్లా ఇంచార్జి తేజవత్ అభినాయక్

నవతెలంగాణ-మరిపెడ



డోర్నకల్ నియోజకవర్గంలోని సిరోలు ఎసారెస్పి కాలువ మళ్ళింపు ప్రయత్నంను కుట్రపూరితంగా ప్రభుత్వం,రైతులు నుండి ఏవిధమైన అధికారిక అనుమతులు లేకుండా కాలువ మళ్లింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని బీఎస్పీ బాధిత రైతుల ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు సమక్షంలో బిఎస్పి పార్టీ జిల్లా ఇంచార్జి తేజవత్ అభినాయక్ జిల్లా ఉపాధ్యక్షులు తగరం నాగన్న మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఏ విధమైన అధికారిక అనుమతులు లేకుండా ఈఈ వ్యక్తిగతంగా మౌఖిక అనాధికార ఆదేశాలు ఇవ్వడం వెనుక దాగివున్న మాతలబు ఏంటో రైతులకు, ప్రజలకు, ప్రభుత్వంకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.ఈఈ వ్యక్తిగతంగా అనాధికారికంగా ఇచ్చిన మౌకిక ఆదేశాలు ప్రకారంఏఈ రాజమణి, సర్వేయర్ తిరుమల రావు వ్యవసాయం భూముల్లో అనధికారికంగా సర్వే చేసి రైతులను మానసిక వేధింపులు చేయడం భయభ్రాంతులకు గురిచేయ్యటం చట్టం విరుద్ధమైన చర్యలకు పాల్పడటమే అని కనుక సదురు అధికారులను వెంటనే సస్పెండ్ చేసి కేసులు పెట్టి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి అని బాధిత రైతులు, పార్టీ నాయకులు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. కొంతమంది రెడ్డి సామజిక వర్గం వారి స్వార్థప్రయోజనాల కొరకు ఎస్సారెస్పీ కాలువ మళ్లింపు చేయడానికి స్థానిక రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ పదవికాలం ముగించక ముందు ఈ ఘనకార్యన్ని చక్కపెట్టుకోవాలి అని విశ్వాప్రయత్నాలు చేస్తూ తోటి రెడ్డి సామాజిక బంధు వర్గానికి మేలు చేయడానికి కొంతమంది అమాయక రైతులను, వ్యక్తులను అడ్డుపెట్టుకొని నానా తంటాలు పడుతున్నారని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గం వారు అధికారులతో కుమ్మకై అనధికారికంగా చట్ట విరుద్ధంగా చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు చేశారు. రైతులు, ప్రజలు అన్ని గమనిస్తున్నారని వారే సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, నీటి పారుదల శాఖ, రెవిన్యూ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కాలువ మళ్లింపు నిలిపివేయాలని రైతులు కోరుకుంటున్నారు. లేనిపక్షంలో రైతులు, బీఎస్పీ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి ఐనాల పర్శరాములు, డోర్నకల్ అసెంబ్లీ అధ్యక్షులు భాషిపంగు మహేందర్, మండలం అధ్యక్షులు జినక కృష్ణ మూర్తి, రైతులు బెజ్జనబోయిన పెద్ద లింగన్న, చిన్న లింగన్న, రాం ఉప్పలయ్య మండడి రాజేష్, వల్లపు నరేష్, పత్తి సహదేవ, కృష్ణ సంపత్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి

- తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ సరస్వతి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

మున్నూరు కాపు సంఘ నాయకులు ఐక్యంగా ఉండి సంఘం బలోపేతానికి కృషి చేయాలని తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ పుప్పాల సరస్వతి అన్నారు. శనివారం మండలంలోని హరిపిరాల గ్రామంలో మల్లికార్జున మున్నూరు కాపు అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని నాయకులందరూ సంఘాన్ని పటిష్టపరిచి ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు పుప్పాల రవి, ఉపాధ్యక్షులు కూన మధు, ప్రధానకార్యదర్శి మలిశెట్టి చెన్నయ్య, కూన వెంకన్న, సంఘం సలహాదారుడు బొమ్మరాతి రాఘవులు, కూన వీరన్న, కోశాధికారి పుప్పాల మధుకుమార్, మున్నూరుకాపు మహిళా అధ్యక్షురాలు బొమ్మరాతి ఎలేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బాలికల హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలుమాస అరుణ

నవతెలంగాణ-నెల్లికుదురు

బాలికలు తమ హక్కులను తెలుసుకొని ప్రతీ ఒక్క బాలిక హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో బాలికల హక్కుల గురించి వారి వ్యక్తిగత పరిశుభ్రతపై సంబంధిత శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని శనివారం సమావేశాన్ని నిర్వహించి అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో కార్యాలయంలో ఐకెపి వెలుగు కార్యాలయంలో భేటీ బచావో బేటి పడావోకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ తరంగిణి, ఎంపీఓ పార్థసారధి, అంగన్వాడి సూపర్వైజర్లు మాట్లాడారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.బాలికలకు ఏదైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే సంబంధిత టీచర్ లేదా పోలీసులు లేదా మాకు గాని ఫోన్ చేయవచ్చు అని అన్నారు. ఈ సందర్భంగా బాలికలకు శానిటరి నాప్కిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఐసిడిఎస్ సూపర్వైసర్ మల్లేశ్వరి, ఉష రాణి, విజయలక్ష్మి నాగమణి, హెచ్ఈఓ వెంకటేశ్వరల్లు , సిహెచ్ఓ శాంతా, విమలా, మహిళా సాధికారత కేంద్రం స్టాఫ్ సంధ్యారాణి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మానుకోట విద్యుత్ సరఫరాలో అంతరాయం

- విద్యుత్ శాఖ పట్టణ ఏఈ నవ్య శ్రీ

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాకలో ఉన్న 11 కెవి ఫీడర్ లైన్‌లో ఉన్న కాలనీలకు ప్రాంతాలకు ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ నవ్యశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో చెట్లు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని ఆ కొమ్మలను తొలగించుటకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో పట్టణంలోని మిలిటరీ కాలనీ, నందమూరినగర్, సిగ్నల్ కాలనీ, క్రిష్ణాకాలనీ, కొండపల్లి గోపాల్‌నగర్ ఉన్నాయని తెలిపారు. ఆయా కాలనీ ప్రజలు సహకరించాలని కోరారు.

న్యూ డెమోక్రసీకి మద్దివంచ సర్పంచ్ రాజీనామా

నవతెలంగాణ-గార్ల



సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీకి మద్దివంచ ఉప సర్పంచ్ లావుడియా భీముడు రాజీనామా చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నానని ఇంత కాలం అండగా నిలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యావాదాలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-మహదేవపూర్

కాటారం మండలం ఇబ్రంపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ దుర్గయ్య శనివారం మృతిచెందగా మహాదేవపూర్ మండలం అన్నారం ఎంపీటీసీ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మంచినీళ్ల దుర్గయ్య వారి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలో పాల్గొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ మండల కోఆర్డినేటర్ ఎన్.శిరీష

నవతెలంగాణ-మరిపెడ

మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ నిరుడు శిరీష అన్నారు. శనివారం మండలంలోని అబ్బాయి పాలెం గ్రామంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు ఝాన్సీ లక్ష్మీ బాయి గ్రామైక్య సంఘం సిఎ తీగల లలిత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి నిరుడు శిరీష పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని చట్ట రీత్యా నేరమని మహిళలకు సూచించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను హింసలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపు నిచ్చారు. వేధింపులు జరిగినప్పుడు క్రైమ్ బ్రాంచ్‌కి ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 100,1098,1930, మహిళా రక్షణ కోసం సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చన్న, గ్రామ వార్డు సభ్యురాలు ఎస్‌కె చాందిని, మహిళా సంఘం నాయకురాలు పోలేపొంగు నాగమణి, తీగల ఏకమ్మ, జనక వెంకటమ్మ శ్రీదేవి, లక్ష్మి, మంజుల, భద్రమ్మ తీగల పూలమ్మ, జినక చంద్రమ్మ, గొంగడి నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వరంగల్ ఖమ్మం ప్రధాన రహదారిపై శనివారం ఉదయం జరిగింది. మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన అనుమాండ్ల వాసుదేవరెడ్డి (42) వ్యక్తి గత పనుల నిమిత్తం తొర్రూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఫతేపురం గ్రామ స్టేజి రోడ్డు దాటుతుండగా ఇటుక బట్టీల వద్ద పత్తి లోడుతో వెళ్తున్న అశోక లేలాండ్ వాహనం వెనుక నుండి వచ్చి ఢీకొట్టగా మృతి చెందాడు. మృతునికి కారణమైన టాటా ఏసీ డ్రైవర్ పై మృతుని భార్య హనుమాన్ల నవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : సుధాకర్ రావు

నవతెలంగాణ-పెద్దవంగర

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్ రావు అన్నారు. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పల్లె సోమయ్య కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముత్తినేని శ్రీనివాస్, ఉప సర్పంచ్ మొర్రిగాడుదుల శ్రీనివాస్, తంగళ్ళపల్లి మల్లికార్జున చారి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కేశబోయిన కుమారస్వామి, బొల్లు ఉషయ్య, బొల్లు మల్లయ్య, బొల్లు సాయిలు, కేషబోయిన సుభాష్, కేషబోయిన ఐల్లయ్య మేకల వెంకటయ్య తదితరుల పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

సీసీ రోడ్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-మంగపేట

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లిపల్లి శివయ్య శనివారం మండలంలోని రాజుపేట గ్రామంలో సీసీ రోడ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రి సీతక్క చొరవతో ఐదు లక్షల రూపాయలతో 100 మీటర్ల రోడ్ మంజూరవడంతో తాము పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్ర బాబు, జిల్లా ప్రచార కార్యదర్శి సింగిల్ విండో డైరెక్టర్ కోడం బాలకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ గంట సునీత రామారావు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు పల్లికొండ యాదగిరి, కిసాన్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు చౌలం వెంకటేశ్వర్లు, బ్లాక్ కార్యదర్శి తుమ్మూరి రాంరెడ్డి, గ్రామాధ్యక్షులు పొట్రూ సమ్మయ్య సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనువాస్, తుమ్మల ముఖర్జీ, అల్లపాటి శ్రీను, అణువుల రాఘవరెడ్డి, బోనుగు హనుమంతరావ్, పుల్లారావ్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత న్యాయ సహాయం, బాలల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.మాధవి

నవతెలంగాణ-ములుగు



ఉచిత న్యాయ సహాయం, బాలల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలనీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.మాధవి తెలిపారు. జిల్లా న్యాయ సేవ అదికార సంస్థ ములుగు ఆధ్వర్యంలో జిల్లా బాల రక్ష భవన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు మాధవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మికులు, ఫోక్సో బాదితులు, ఉచిత న్యాయ సహాయం, ఇతర బాలల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ములుగు అదికారి కె.స్వాతి, బాలల పరిరక్షణ యూనిట్ స్టాఫ్, చైల్డ్ లైన్ స్టాఫ్, సఖి సిబ్బంది, పారా లీగల్ వాలునటీర్స్ పాల్గొన్నారు. అనంతరం ములుగు పట్టణంలోని బాలుర వసతి గృహంను మాధవి తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్‌ను వ్యక్తిగతంగా జిల్లా న్యాయాధికార సంస్థకు హాజరు కావాలని తెలిపారు.

బాలుడి వైద్యానికి తస్లీమా పదివేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-గోవిందరావుపేట



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వైద్యానికి మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పదివేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందించి దాతృత్వం చాటుకున్నారు. శనివారం హనుమకొండలోని డాల్ఫిన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చల్వాయి గ్రామానికి చెందిన నాగరాజు మౌనిక దంపతుల కుమారుడు లక్ష్మణ్‌ను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన వెల్పుగొండ నాగరాజు-మౌనిక దంపతుల కుమారుడు లక్ష్మణ్ ఆడుకుంటూ క్రింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. మెదడులో రక్తం గడ్డ కట్టిందని ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. తస్లీమా, బాబు తల్లిదండ్రులను ఓదార్చి, బాబు ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడి మంచి వైద్యం అందించాలని కోరారు. బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయలు సాయం అందజేశారు.

బలరాంను మర్యాదపూర్వకంగా కలిసిన స్వరూప

నవతెలంగాణ-ములుగు



బీజేపీ ములుగు జిల్లా నూతన అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన సిరికొండ బలరాంను బిజెపి మహబూబాబాద్ పార్లమెంటు నాయకురాలు గుగులోత్ స్వరూప శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ములుగు జిల్లాకు నూతన ఉత్సాహంతో బీజేపీ ముందుకు సాగుతుందన్నారు. రాబోవు పార్లమెంటు ఎలక్షన్లో బీజేపీ మహబూబాబాద్ పార్లమెంటు స్థానాన్ని గెలవడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అదేవిధంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆశయసాధనలో ప్రతీ ఒక్కరం కలిసి ముందుకు వెళతామన్నారు. భారతదేశం ప్రపంచ స్థాయిలో అగ్రరాజ్యంగా నిలబడిందంటే ఈరోజు కేంద్రంలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోడీదే ఆ ఘనత అని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంటుకు ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శిలమంతుల రవీంద్ర చారి, కార్యాలయ కార్యదర్శి చల్లూరి మహేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జున్నికల కృష్ణాకర్‌రావు, యువత జిల్లా అధ్యక్షులు కొత్త సురేందర్, ఎటురునాగారం మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కత్తి హరీష్, నాయకులు బైకని మహేందర్, కాంత, పల్లవి, అఖిల, సాయి, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బెస్తగూడెంలో పోలీసుల దాడులు

నవతెలంగాణ-వెంకటాపురం



బెస్తగూడెం గ్రామంలో నాటు సారా తయారీ జరుగుతుందన్న సమాచారంతో శనివారం సీఐ బండారి కుమార్ అద్వర్యంలో ఎస్సైలు ఆర్.అశోక్, కె.రఘుపతి రావులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1000 లీటర్ల బెల్లం ఊట, సారా తయారీకి ఉపయోగించే వస్తువులను గుర్తుంచి వాటిని ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న రాము, పుల్లారావులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయాలు జరిపినా పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ నిచ్చారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-ములుగు



గుడుంబా అమ్మకాలను నియంత్రించేందుకు వెంకటాపూర్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని మల్లయ్య పల్లె, చత్రుప్పలపల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీ పాత్రలను ధ్వంసం చేయడంతో పాటు అక్రమంగా గుడుంబా కాస్తున్న చత్రుప్పలపల్లికి చెందిన భూక్య రాజారాం, మల్లయ్యపల్లికి చెందిన జరుపుల లక్ష్మి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారు చేయడం, విక్రయాలు జరపడం చేస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదని ఎస్ఐ హెచ్చరించారు. ఎవరైనా గ్రామాల్లో గుడుంబా కాసినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-గోవిందరావుపేట



వాహన డ్రైవర్లు ప్రజలు రహదారి ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని పసర ఎస్ఐ షేక్ మస్తాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్‌లు ప్రజలతో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ షేక్ మస్తాన్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు ప్రతీ ఒక్కరు తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని తెలిపారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతీ ఒక్క వ్యక్తి రూల్స్‌ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, మద్యం సేవించి వాహనం నడిపితే ప్రమాదం జరగటానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. ఈ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నవతెలంగాణ-ములుగు



వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో వెంకటాపూర్ పోలీసులతో కలసి వాహనాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ ఎస్ఐ రాజు మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల నేపథ్యంలో ఈనెల 15 నుండి ఫిబ్రవరి 14 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామప్పకు వచ్చే భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

- ములుగు జిల్లాకు అభివృద్ధి నిధులు అధికంగా

మంజూరు చేయాలి : మంత్రి సీతక్క

నవతెలంగాణ-ములుగు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మాపాలన ఉండబోతుందని, ములుగు జిల్లాకు అభివృద్ధి నిధులు అధికంగా మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతంతో పాటు చిన్న చిన్న వాగులు, పెద్ద పెద్ద చెరువులు చాలా ఉన్నాయనీ రామప్ప, లక్నవరం సరస్సులను అనుసంధానం చేయడం కోసం శాశ్వత గ్రావిటీ కాలువలు నిర్మాణం కోసం ల్యాండ్ అక్యువేషన్ జరిగిందన్నారు. పెండింగ్లో ఉన్న ల్యాండ్ అక్యువేషన్‌కు డబ్బులు అందించాలని రాబోయే వేసవి కాలంలో త్రాగు,సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, మేడారం జాతర, పర్యాటక కేంద్రాలు జిల్లాలో ఉన్నందున వచ్చే బడ్జెట్‌లో ములుగు జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వరద ఉధృతిలో కొట్టుకు పోకుండా గోదావరి కరకట్ట నిర్మాణం చేపడుతున్నామని, వరదలు వచ్చినప్పుడు గ్రామాలు మునిగి పోయే ప్రమాదం ఉన్న చోట కటకట్ట నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని, మేడారం జాతరకు అన్ని జిల్లాల అధికారులు మంత్రులు సహకరించాలన్నారు. జాతరకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయాలని, ఈ నెల 25 లేదా 28న మంత్రులు మేడారం జాతరకు రావాలని కోరారు. మంత్రి సీతక్క కోరిన విధంగా ముంపు గ్రామాల శివారు గోదావరి వద్ద రిటెన్టింగ్ వాల్ నిర్మించాలని మంత్రి పొంగు లేటి అధికారులకు సూచించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శభరిష్, ఐటిడిఏ పిఓ అంకిత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, డి.వేణుగోపాల్, ఆర్డీఓ కే. సత్యపాల్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పట్టభద్రులందరూ ఓటరు నమోదు చేసుకోవాలి

- జిల్లా యువజన కాంగ్రెస్ కోశాధికారి ఆకుతోట అన్వేష్

నవతెలంగాణ-ములుగు



ములుగు నియోజకవర్గ స్థాయిలోని పట్టభద్రులందరికీ తమ ఓటరు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన కాంగ్రెస్ కోశాధికారి ఆకుతోట అన్వేష్ తెలిపారు. శనివారం అన్వేష్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున, నియోజకవర్గ స్థాయిలో ఉన్నటు వంటి పట్టభద్రులు అర్హత కలిగిన ప్రతీ యువతీ-యువకులు మన హక్కుని మనం వినియోగించుకోవాలని, అందరూ ఓటర్ నమోదు చేసుకొని ఎన్నికలలో పాల్గొని సరైన నాయకులను ఎన్నుకునే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అన్వేష్ కోరారు.

గిరిజనుల ఆర్థికంగా ఎదగాలి : కొమరం ప్రభాకర్

నవతెలంగాణ-మంగపేట



ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు స్థానిక వనరులను ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని కత్తిగూడెం, రాజుపేట గ్రామాల్లో ఇసుక రీచ్‌ల కోసం పెసా గ్రామ సభలు ప్రత్యేక అధికారులు కె.రాజు, మంతిని మమతల పర్యవేక్షణలో ఏకగ్రీవంగా జరిగాయి. కత్తిగూడెం ఇసుక రీచ్ నిర్వహణకు 12 మంది సభ్యులు గల శ్రీ ఆంజనేయ ఇసుక క్వారీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. రాజుపేటలో 161 మంది సభ్యులకు గాను 91 మంది సభ్యులు గ్రామ సభకు హాజరు కాగా ఇద్దరు వ్యక్తులు తీర్మానాన్ని వ్యతిరేకించగా 89 మంది క్వారీ తీర్మానానికి తమ ఆమోదాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆలేటి సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు పత్తిని శ్రీధర్, కె.సురేష్ పెసా కమిటీ జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భూపాలపల్లి

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ కళాశాల ప్రిన్సిపల్ తాటి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఎంపీ సీ, బైపీసీ, కోర్సులలో ప్రవేశాల కోసం అన్ని మైనారోటీ వర్గాల పదవ తరగతి చదువుతున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు కూడా దరఖా స్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారలు మార్క్స్ కాలనీలోని మైనారిటీ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ పరీక్ష

నవతెలంగాణ-భూపాలపల్లి

జిల్లాలో శనివారం చేపట్టిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది అని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రాంకుమార్ తెలిపారు శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రవేశ పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ జవహర్ నవోదయలో ఆరవ తరగతి ప్రవేశం పొందుట కొరకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 238 మంది దరఖాస్తు చేసుకోగా 194 మంది హాజరైనట్లు తెలిపారు. కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 1977 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 143 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎస్.రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్ రెడ్డి తెలిపారు.రెండు పరీక్ష కేంద్రాలను సందర్శించి ప్రవేశ పరీక్ష నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. వీరి వెంట డిసిఇబి సహాయ కార్యదర్శి భద్రయ్య, పరీక్షల విభాగం అధికారి కుసుమ కృష్ణమోహన్ ఉన్నారు.

వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

నవతెలంగాణ-భూపాలపల్లి

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎండి సంధాని సూచించారు. శనివారం జాతీయ రోడ్డు భద్రత మాస వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో భూపాలపల్లి సిఐ రామ్ నరసింహారెడ్డితో కలిసి హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖ అధికారి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని నడిపే ప్రతీ ఒక్కరు విధిగా హెల్మెట్ ఉపయోగించాలని కోరారు. హెల్మెట్ ఉపయోగించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో చాలామంది మృత్యువాత పడుతున్నారన్నారు.దీంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందని, ప్రమాదాలను నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరు కంకణబద్ధులై రోడ్డు నియమాలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించి క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

దళిత బంధు పథకాన్ని అమలు చేయాలి : కేవీపీఎస్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను వెంటనే విడుదల చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మంద సంపత్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో దళితులు నేటికీ అనేక వివక్షతలను ఎదుర్కొంటూ బ్రతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .తెలంగాణలో 18 శాతంగా ఉన్న దళితులకు కేవలం రెండు శాతం మాత్రమే భూమి కలిగి ఉన్నారని తెలిపారు. కొద్దిమంది చేతుల్లో భూమి కేంద్రీకృతమై ఉందన్నారు. భూమి లేకపోవడం వలన దళితులు వ్యవసాయ కూలీలుగా, కార్మికులుగా, పారిశుద్ధ పని వారిగా, అసంఘటిత రంగ కార్మికులుగా, డ్రైవర్లుగా, 4వ తరగతి ఉద్యోగులుగా బ్రతుకుతున్నారన్నారు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పారదర్శకంగా అమలు చేయాలని, ప్రభుత్వం జిల్లాలోని ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత బంధు కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన 17.700 కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేసి దళిత బంధు కేటాయింపులో రాజకీయ నాయకుల జోక్యం గత ప్రభుత్వంలో కాకుండా ప్రభుత్వ అధికారుల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. భూపాలపల్లి జిల్లాలో ప్రతి దళిత కుటుంబానికి 58 జీవో ప్రకారం 125 గజాల స్థలం ఇచ్చి పక్క ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మహేందర్, ప్రధాన కార్యదర్శి గుర్రం దేవేందర్, శ్రీధర్, చందు, శ్రీనివాస్, బుచ్చయ్య లక్ష్మణ్, సారయ్య పాల్గొన్నారు.

గుండె పోటుతో రైతు మృతి

నవతెలంగాణ-మల్హర్‌రావు

పొలంలో వ్యవసాయ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గుండెపోటుతో బిర్నేని రాజయ్య (45) అనే రైతు మృతి చెందిన సంఘటన తాడిచెర్లలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల, కుటుంబ సభ్యుల పూర్తి కథనం ప్రకారం రాజయ్య మండలంలోని రుద్రారం గ్రామంలో తనకున్న పొలంలో ఒడ్లు కొడుతున్న సమయంలో ఒకేసారి ఛాతీలో నొప్పిరావడంతో పొలంలోనే కుప్పకూలినట్లుగా తెలిపారు. విషయం తెలుకున్న చుట్టుపక్కల వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే అతను మరణించినట్లుగా వాపోయారు. గుండెపోటుతో రాజయ్య గతంలో అనారోగ్యంతో భార్య రజిత, కుమారుడు సాయిధరమ్ తేజ్‌లు మృతిచెందడంతో బాధితుని కుమార్తె స్పందన అనాథగా మారింది. దీంతో గ్రామస్తులతోపాటు పలువురు శోకసంద్రలో మునిగిపోయారు.

మానవ అక్రమ రవాణా నిరోధించడం అందరి బాధ్యత : సీడీపీవో

నవతెలంగాణ-మహదేవపూర్

మానవ అక్రమ రవాణాని నిరోధించడంలో బాధ్యత వహించాలని సిడిపిఓ రాధిక అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లకు ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్ కుమార్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లకు చిత్రాలను ప్రదర్శించి వివరించారు. అవగాహన కల్పించాలి అనంతరం రాధికా మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా పరిగణించబడిన ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు ఇతర రాష్ట్రాలకు, విదేశాల రవాణాకు గురి అవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు దీని పై అవగాహనా కలిగి ఉండాలని ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికీ అవగాహనా కల్పించి రక్షించాలన్నారు.అనంతరం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మ శ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయముతో పనిచేస్తూ 28200 మంది అమ్మాయిలను మహిళలను కాపాడి వారికీ పునరావాసం కల్పించామన్నారు. అనుమానస్పద వ్యక్తుల నుండి మెసేజ్ గాని కాల్స్ గాని వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సమస్య ఏర్పడితే 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ శివ, అనిల్, సూపర్వైజర్ రాధికా, రమాదేవి, నాగరాణి వీణ, భాగ్యలక్ష్మి, శివరాణి, మమతా, సరస్వతి అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ సందర్శించిన తహసిల్దార్

నవతెలంగాణ-మహదేవపూర్



మండలంలోని కుదురుపల్లి గ్రామంలో పోలింగ్ స్టేషన్ 172ను శనివారం తాసిల్దార్ లక్ష్మీరాజయ్య సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 20, 21 తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ ఈ సందర్భంగా ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాల నిండిన వారందరిని ఓటు నమోదు చేసుకునేలా ప్రోత్సహించేలా ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ వెల్లడించారు. ఈ కార్యక్రమం బూత్ లెవెల్ సిబ్బంది పాల్గొన్నారు

నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మహదేవపూర్



మండలంలోని జూనియర్ కాలేజీలో శనివారం ఎన్ఈపిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్ హాజరై మాట్లాడుతూ దేశంలో విద్యారంగ పరిరక్షణకు, విద్యారంగాన్ని కాపాడాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అందరికీ చదువు,అందరికీ ఉపాధి కల్పించాలని, జాతీయస్థాయి మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్ రద్దు చేయాలని తెలిపారు. వేసి వయస్సులోనే విద్యార్థుల పాఠ్య పుస్తకాల్లో మతోన్మాద భావాజా లాన్ని జొప్పిస్తూ విద్యారంగాన్ని కాషాయీకరిస్తున్నారన్నారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలగించి, జాతీయోద్యమంతో సంబంధం లేని హెగ్డే వార్, విడి సావర్కర్ల చరిత్రను పొందుపరుస్తున్నారని, జ్యోతిష్యం, వాస్తు వంటి అశాస్త్రీయ భావజాలాన్ని విద్యార్థుల మెదళ్ళలోకి ఎక్కిస్తూ మొద్దు బారుస్తున్నారన్నారు.ఎన్‌టిఏ వంటి సంస్థలను రద్దు చేయాలని, జాతీయ స్థాయి పోటీ పరీక్షలను ఈ సంస్థ ద్వారా నిర్వహించడం ద్వారా విపరీత అధికార కేంద్రీకృతమై విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

నూతన ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలు నెరవేర్చాలి

రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 7800 కోట్ల రూపాయల పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వాలని, రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలకు సరిపడా నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వం మాదిరిగానే నియంతృత్వ పోకడలకు పోతే విద్యార్థులు సరైన రీతిలో స్పందించి తీరుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు, జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరణ్, ఎస్ఎఫ్ఐ మహదేవ్ మండల ఉపాధ్యక్షుడు కుమ్మరి అంజి పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 562 మంది ఎంపిక

నవతెలంగాణ-ములుగు

ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అంకిత్ ఆదేశానుసారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఎటునాగారం ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని ములుగు మండలం జాకారం యూత్ ట్రెనింగ్ సెంటర్లో నిర్వహించిన జాబ్ మేళాలో 562 మంది యువతీ యువకులు ఎంపికయ్యారు. జాబ్ మేళాలో 23 వివిధ ప్రైవేట్ కంపెనీలు పాల్గొనగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి 676 మంది హాజరు కాగా 562 మంది వివిధ కంపెనీలలో ఎంపికైనట్లు ఐటిడిఏ ఏపీవో జైవసంతరావు తెలిపారు. ఎంఫికైన అభ్యర్థులకు అపాయింట్మెంట్ లెటర్స్‌ను ఏపీవో వసంతరావు అందజేశారు. వివిధ కంపెనీలలో ఎంపికైన వారు సోమవారం నుండి విధులకు హాజరు కావాలని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వేతనం నెలకు 15000 వేల నుండి 35 వేల వరకు వారి యొక్క అర్హతను బట్టి సంబంధిత కంపెనీ వారు నిర్ణయించడం జరిగిందని ఏపీవో తెలిపారు. అనంతరం వసంతరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఇలా త్రిపాఠి ప్రాజెక్టు అధికారి అంకిత్‌లు నిత్యం గిరిజన అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఇటువంటి జాబ్ మేళాలు ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. జాబ్ మేళాలో హాజరైన గిరిజన యువతీ యువకులకు భోజన వసతి, మంచినీటి వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి బాలస్వామి, డిపియం ఏ.సతీష్, డిపిఎం, జేడియం కొండలరావు, ఉమ్మడి జిల్లాలోని, ఏపిఎం, జేఆర్పీలు, ఐటీడీఏ ఉద్యోగులు, లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్, వెంకట రంగారావు, హెచ్చఖ్యూఓ, ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డిటిఎఫ్ క్యాలండర్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో డిటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ డైరీ శనివారం డిటిఎఫ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి ఎస్.వీరన్న ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బిల్లు వెంటనే విడుదల చేయాలని, జిల్లాలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులలో తాత్కాలిక ప్రాతిపదికన విద్యా వాలంటీర్లను నియమించాలని, ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌ను నియమించాలని, మధ్యాహ్న భోజన సిబ్బందికి రావలసిన గౌరవ వేతనము, పెండింగ్ బిల్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. మన ఊరు మనబడి పథకం కింద పెండింగ్‌లో ఉన్న పాఠశాలల మరమ్మత్తులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బాధ్యులు రాంబాబు, జిల్లా కౌన్సిలర్ సదయ్య లతోపాటు సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును పరిశీలించిన తహసిల్దార్

నవతెలంగాణ-గణపురం

రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ మురళీధర్ రావు తెలిపారు శనివారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఓటర్ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.18 సంవత్సరాల నిండిన ప్రతీఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం రెండు రోజులపాటు ఉంటుందన్నారు. గ్రామాల్లోని బిఎల్వోలు రెవెన్యూ సిబ్బంది కలిసి ఈ ఓటర్ నమోదు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

త్వరలోనే రాష్ట్రానికి 200 కంపెనీలు

నవతెలంగాణ-మహదేవపూర్

తెలంగాణకి పని చేసే సేవకుడు ఐటీని టాప్‌లో ఉంచబోతున్న ఐటి మినిస్టర్ దుద్దిల్ల శ్రీదర్ బాబు అని మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లేతకారి రాజబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఐటి మినిస్టర్ శ్రీధర్ బాబు తెచ్చిన పెట్టుబడులు 40,000 కోట్ల రూపాయలు యువతకి ఉపాధి చూపెడుతుందన్నారు. చదువు విలువ తెలిసి నాయకుడు గుణవంతుడు పనిపంతుడు మన మంథని బిడ్డ దుద్దిల్ల శ్రీదర్ బాబు ఐటి మినిస్టర్‌గా బాధ్యతలు పెట్టిన నెల రోజుల్లోనే 40,000 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో రాష్ట్రానికి ఐటి పరిశ్రమలు తీసుకురావడం మంత్రి దుద్దిల్లడి శ్రీధర్ బాబు ఘనత అని రాజబాబు అన్నారు.